
# మిసిమి

మాస పత్రిక

మే - 2000



వెల-రూ. 8/-



రెనాల్డ్స్ ( 1723- 1992 )

# చిత్రకారుని గురించి

రెనాల్డ్స్ కళా సాహిత్యాలను ఎంతో అభిమానించేవాడు. ఈ అభిమానం కళాకారుని అంతస్తును పెంచాలనే అతని జీవిత వాంఛకు జీవం పోసింది. అంతకు ముందు ఎవరూ కని విని ఎరుగని విజయాన్ని తన వృత్తిలో సాక్షాత్కరించుకోవడంతో, తన లక్ష్యం నెరవేరింది. జీవిత సాఫల్యం చేకూరింది.

పద్దెనిమిదో శతాబ్దిలో బ్రిటన్‌లో అత్యంతంగా విశిష్టుడైన కళాకారునిగా ఎదిగాడు రెనాల్డ్స్. అతడు కళావృత్తి చేపట్టిన మొదటి దినాల్లో కళాకారుని వృత్తి అధోగతిలో ఉండేది. తన వ్యక్తిగత ప్రతిష్టతో నాటి ఉద్దండ సాహితీకాయిలతో తనకున్న పరిచయాలతో, సమాజానికి కళపట్ల ఉన్న దృక్పధాలలో విప్లవం తీసుకువచ్చాడు. ఆ విధంగా అతడు రాయల్ అకాడమీ ప్రసిడెంట్‌గూడ అయ్యాడు.

అతడు మొదటి నుంచి గూడ పండిత కళాకారుడు కావాలని కలలు కనేవాడు. అందుకని అతడు రూబెన్స్, రాఫెల్, మైకలాంజెలో లంటే ఇష్టపడేవాడు. రాయడంలోను, చిత్రలేఖనంలోను ఎంతో ఎత్తులకు ఎదిగాడు.

ఒక కవిలాగ, చిత్రకారుడు, తన నాయకుని ఒకగొప్ప వ్యక్తిగా మాట్లాడించలేడు. అందుకని అతడు తన నాయకుని గొప్పవానిగా కనిపించేట్టు చేయాలి. తన మోడల్ ''ఉదాత్త మనస్సును'' ప్రతిబింబించాలనుకొంటే, అతని లోపాలను సరిదిద్దాల. అలెగ్జాండర్ పొట్టివాడైనంత మాత్రాన అతనిని పొట్టిగా చిత్రించవలసిన పనిలేదు. అటువంటి శారీరక లోపాలను అధిగమించాలంటే మనం పూర్వీకులను అనుకరించాలి. అంటే ఆదర్శవంతమైన సౌందర్యానికి అవసరమైన నియమాలను పొదిగిఉన్న పూర్వకాలపు గ్రీకు, రోమన్, శిల్పాలను అనుసరించాలి.

ఇతడు 1723లో ప్లైమ్‌టన్‌డెవన్‌లో శామ్యూల్ రెనాల్డ్స్ అనే క్రైస్తవ మతాచార్యునికి పుట్టాడు. అప్పట్లో కొత్తగా ఏర్పడిన రాయల్ అకాడెమీకి 1768లో ప్రథమ అధ్యక్షుడయ్యాడు. 1792లో లండన్‌లో మరణించాడు.

ముఖచిత్రం : **కళాత్మక సిద్ధాంతం**

ఈ ప్రతీకాత్మక వ్యక్తిని సామర్సెట్ భవనం లైబ్రరీ కప్పు నలంకరించడానికి చిత్రించాడు. నిజమైన స్వభావం యొక్క సిద్ధాంత, జ్ఞానాలను ఈమె ప్రతిబింబిస్తుంది.

# మిసిమి

**"All that we are is the product of what we have thought" is "We are what we think." - Dammapada.**

సంపుటి 12 మే 2000 సంచిక 5

వ్యవస్థాపక సంపాదకుడు : డాక్టర్ **రవీంద్రనాథ్ ఆలపాటి**

## విషయసూచిక


ఆధునిక యక్షుడి ప్రశ్నలు పది! - సి. ధర్మారావు

లుంబినీ తవ్వకాల్లో దొరికిన రాతి మీదే సిద్ధార్థుడు జన్మించాడా? - శివనాగిరెడ్డి

అంతర్వాచకత్వం - బి. తిరుపతిరావు

కవిత్వము - విశ్వజనీనత - డా॥ యు. ఏ. నరసింహమూర్తి

మారుతున్న ప్రపంచం - మాటల కూర్పులు - శ్రీ విరించి

దేశోద్ధారక శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు - మువ్వల సుబ్బరామయ్య

దివ్యశక్తులు వుంటే 5కోట్ల రూపాయలు సంపాదించవచ్చు - ఎన్. ఇన్నయ్య

కాలానికి కమ్మని వ్యాఖ్య (A BRIEF HISTORY OF TIME) - కస్తూరి


విడిప్రతి రూ. 8/- వార్షిక చందా రూ. 100/- విదేశీయులకు $ 20

ముఖచిత్రం : **కళాత్మక సిద్ధాంతం**

**Printed & Published by BAPANNA ALAPATI at Kala Jyothi Process Ltd., 1-1-60/5, R.T.C. X Roads, Musheerabad, Hyd-20. Ph. 7645536**
**e-mail : misimi_m@hotmail.com**
**http : //www.misimi.com**

సంపాదకుడు : **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**

# ఆధునిక యక్షుడి ప్రశ్నలు పది!

**– సి. ధర్మారావు**

అలనాటి యక్షుడు ఈకాలంలో అయితే ధర్మజుడికి ఏమి ప్రశ్నలు వేసి వుండేవాడు - అన్న చిలిపి ఆలోచన యిది. ప్రశ్నలు కూడ ఆధునిక రీతిలో 'ఆబ్జెక్టివ్'గా వుండాలి గదా! జవాబులు మీరుకూడ 'టిక్' చేసి, ధర్మజుడి జవాబులతో సరిచూసుకోండి. అప్పుడు మీరెంత ఆధునికులో తెలిపోతుంది.

***1. మనిషి వర్తనలో మిక్కిలి విస్మయం కలిగించే అంశం ఏది?***

క) మనుషుల్ని కాక, డబ్బుని నమ్ముకోవటం

చ) రెండోపక్షం వాదనంటూ ఒకటి వుండొచ్చని గుర్తించకపోవటం

ట) నిత్యం తన కళ్లముందు అయిన వాళ్లు, కాని వాళ్లు లోకంనించి నిష్క్రమిస్తున్నా, తానేదో శాశ్వతమన్నట్టు వర్తించటం.

***2. మనిషి ఏది ఎక్కువ యిష్టపడతాడు?***

క) ప్రియుడు/ ప్రేయసి    చ) సుఖజీవనం    ట) తనంటే యిష్టపడే వాళ్లని

***3. భారతీయుడి సహజతత్వం ఏమిటి?***

క) ఆధ్యాత్మికత    చ) తన సంతతిలో ఒక్కరినైనా అమెరికా పంపించటం

ట) శ్రీరంగ నీతులు చెప్పటం

***4. భారతదేశపు ప్రథమ శత్రువు ఎవరు?***

క) చైనా    చ) పాకిస్తాన్    ట) చదువుకున్న భారతీయుడు

***5. ప్రపంచంలో ఎనిమిదో అద్భుతం ఏది?***

క) కోట్ల, పి. వీ. రాజకీయాలనుంచి స్వచ్ఛందంగా విరమించటం.

చ) చంద్రబాబునాయుడు 2020వరకు పరిపాలిస్తాననుకోవటం.

ట) భారతదేశంలోని అస్పృశ్యత.

***6. స్త్రీ సహజ సిద్ధ గుణం ఏది?***

క) అసూయ    చ) అలంకార ప్రియత్వం    ట) బిడ్డలపై ప్రేమ

***7. పురుషుడు తట్టుకోలేనంత మానసిక ఒత్తిడి పొందే సందర్భం ఏది?***

క) ఆర్థికంగా దివాలా తీసినప్పుడు    చ) ప్రాణస్నేహితుడు వంచించినప్పుడు

ట) తాను స్త్రీని తృప్తిపరచలేక పోవటం

***8. మనదేశంలో బానిసత్వం ఎక్కడుంది?***

క) తెలంగాణలో    చ) యు.పి., బీహారుల్లో    ట) కాంగ్రెసులో

( మిగతా 136వ పేజీలో)

# లుంబినీ తవ్వకాల్లో దొరికిన రాతి మీదే సిద్ధార్థుడు జన్మించాడా?

– డా. ఈమని శివనాగిరెడ్డి

*(మే, 18 బుద్ధపూర్ణిమ లుంబినీ ఉత్సవాన్ని పురస్కరించుకొని ఈ వ్యాసం)*

మహాపురుషులుగా భావింపబడుతున్న వ్యక్తులు పుట్టినచోటు, తిరిగిన ప్రదేశాలూ, మరణించిన చోట్లు ఏ దేశంలోనైనా చారిత్రక ప్రాధాన్యతను సంతరించుకొన్నాయి. మైథాలజీ లేక ఒక పురాణంలోని సంఘటనలతో సంబంధమున్నట్లు వర్ణించిన స్థలాలు కూడా ప్రాముఖ్యతను సంతరించుకొంటాయి. పౌరాణిక వ్యక్తుల విషయంలో ఎక్కువగానూ, చారిత్రక వ్యక్తుల విషయంలో తక్కువగానూ ఈ ప్రాధాన్యత ఉంటుంది. అలాగే గొప్ప వారైన కొందరి పుట్టుక కూడా అందరికంటే భిన్నంగా ప్రత్యేక రీతిలో జరిగినట్లు సాహిత్య వర్ణనల్లోనూ, మౌఖిక సాంప్రదాయాల్లోనూ మనం ఎక్కువగా చూడవచ్చు. మహాభారతంలోని కర్ణుడు చెవినుంచి, పుట్టాడనీ, అలాగే క్రీస్తు సహజంగా పుట్టలేదనే సాంప్రదాయాలున్నాయి. బుద్ధుడు మాయాదేవి శరీరం పక్క భాగంనుంచి పుట్టాడనే సాంప్రదాయం కూడా ఉంది. అలాగే ఏవూరు వెళ్ళినా సీతమ్మవారు స్నానం చేసిందిక్కడేననీ, ఆమె సంచరించిన ప్రదేశం ఇదేనని చెప్పటం, ప్రతివూరికీ పాండవులతో సంబంధం కల్పించటం రానురానూ చారిత్రక వాస్తవాలు మరుగున పడడానికి దారితీసింది. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి బౌద్ధ స్థూపాన్ని విరాటరాజు దిబ్బ అనీ, తూర్పుగోదావరిజిల్లా రంప ఎర్రంపాలెంలోని బౌద్ధ గుహాలయాలను పాండవుల మెట్టలనీ స్థానికులు చెబుతూ ఉంటారు. చరిత్రపైన అవగాహన లేకపోవటం ఒకవైపు, కావాలని చరిత్రను మరుగున పెట్టటానికి పూనుకొన్న కొందరి ప్రయత్నాలు మరోవైపూ ఇలా చారిత్రక అస్తవ్యస్థతలకు దారితీస్తున్నాయి.

బౌద్ధమతం అంతరించటం, పౌరాణిక వాదం ప్రబలం కావటంతో క్రీ.శ. 6వ శతాబ్దం నుంచి బ్రిటీషు వాళ్ళు చారిత్రక పురావస్తు పరిశోధనలను చేపట్టే వరకూ మనదేశంలో బౌద్ధ క్షేత్రాలు వెలుగుచూడని మాట నిజం. అయితే వాడుకలో ఉన్న కొన్ని సాంప్రదాయాలు నిజాలుకూడా అవుతాయని ఇటీవల నేపాల్‌దేశంలోని లుంబిని వద్ద జరిపిన తవ్వకాలు రుజువు చేస్తున్నాయి. జపాన్ బుద్ధిస్ట్ ఫెడరేషన్ లుంబినీలో 1995లో జరిపిన తవ్వకాల్లో సిద్ధార్థుడు పుట్టినప్పుడు, ఏరాతి మీద ఉంచారో ఆ రాతిని పురాతత్వవేత్తలు గుర్తించటం కొత్త కోణం నుంచి చరిత్రను అంచనా వేయటానికి తోడ్పడుతుంది.

మహాభారత, రామాయణాల్లోని వ్యక్తులు చారిత్రక వ్యక్తులేనని చెప్పగల పురావస్తు ఆధారాలు అందుబాటులో లేవు. మరోవైపు బుద్ధుడు చారిత్రిక వ్యక్తి అని తెల్పిచెప్పే ఎన్నో

ఆధారాలు దొరికాయి. బుద్ధుని జీవితంతో సంబంధమున్న ప్రదేశాలు చారిత్రకంగా నిరూపితం కావటం, అక్కడ వరస వెంబడి కట్టడాలు, కళాత్మక శిలా ఫలకాలుండటం, అంతకు మించి బుద్ధుని, అతని ప్రధాన అనుచరులైన సారిపుత్త, మొగ్గలన్నల శరీర ధాతువులు లభించటం, పైగా శాసనాల్లో వాటిని పేర్కొనటం, పురావస్తు రీత్యా అవి చారిత్రక క్రమ పరిణామ దశలను సూచించే పొరలు, నాణేలు, మట్టి పాత్రలు ఆయా పురాస్థలాల్లో లభ్యం కావటం బుద్ధుడు చారిత్రక వ్యక్తి అనే విషయానికి బలాన్ని చేకూర్చాయి.

బుద్ధుడు పుట్టిన లుంబినీ నేపాలు దేశంలో ఉంటే, అతడు పరిపూర్ణజ్ఞానం సంపాదించి సంబుద్ధుడైన బుద్ధగయ, ధర్మ చక్ర ప్రవర్తన గావించిన సారనాథ్‌లోని మృగదావనం, అతడు మరణించిన కుసినారా, భారత దేశంలో ఉండటం, ఈ స్థలాల్లో జరిపిన తవ్వకాల్లో చారిత్రక తొలియుగపు ఆధారాలు లభించటం మనం గమనించాల్సిన విషయాలు. ఈ స్థలాలన్నింటినీ అశోకుడు సందర్శించి శాసనాలను వేయటం, బౌద్ధ సంగీతుల్లో బుద్ధుని జనన, మరణ ప్రస్తావనలు చోటు చేసుకోవటం, పైగా బుద్ధుని కాలంలో నివశించి ఉన్న ప్రసేనజిత్తు, అజాత శత్రువు మొదలైన వారు చారిత్రక వ్యక్తులుగావటం, వారి పాలనలోనున్న పట్టణాలు, ప్రదేశాలు చారిత్రకంగా నిరూపితంగావటం అన్నీ కలిపి బుద్ధుని చారిత్రకతను ధృవీకరిస్తున్నాయి. ఈ నేపధ్యంలో జపాన్ బుద్ధిస్ట్ ఫెడరేషన్ వారు లుంబినీ వద్ద జరిపిన తవ్వకాలు కూడా ప్రాధాన్యతను సంతరించుకొన్నాయి.

**– సంపాదకుడు.**

చక్కని సిల్కు వస్త్రాలతో అలంకరించుకొన్న మాయాదేవి పరిచారికలు వెంటరాగా ప్రసవానికి తన పుట్టినిల్లు దేవదాహ పట్టణానికి బయలుదేరింది. అడవి ప్రాంతం గుండా వెళ్లే ఆదారి ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. ప్రయాణిస్తున్న మాయాదేవి అటూ ఇటూ చూస్తూ ఆనందంతో మైమరచి పోయింది. ఇంతలో ఆమెకు పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. చుట్టూ కలయజూచినా పరిచారికలుతప్ప ఎవ్వరూ కనిపించని దట్టమైన అడవి అది. సుందర నందన వనంలా ఉంది. ఆ ప్రాంతాన్ని అందరూ లుంబినీ అని పిలుస్తారు. హిమాలయ ప్రాంతంగావటం వల్ల ప్రకృతి మరింత రమణీయంగా ఉంది. మాయాదేవికి ఎక్కువౌతున్న నొప్పుల్ని గమనించి పరిచారికలు సాలవృక్షాల (గుగ్గిలపు చెట్లు) కింద కొంత మరుగును కల్పించారు. మాయాదేవి నిలబడి సాలవృక్షం కొమ్మను పట్టుకొని ఒక మగబిడ్డకు జన్మనిచ్చింది. అతడే సిద్ధార్థుడు.

సిద్ధార్థుని పుట్టుక గురించి బుద్ధచరితం, లలిత విస్తరం అనే బౌద్ధ గ్రంథాల్లో మరిన్ని

వివరాలున్నాయి. వాటి ప్రకారం, నొప్పులు పడుతున్న మాయాదేవికి పరిచారికలు స్నానాలు చేయించారనీ, పుట్టబోతున్న బిడ్డను అంది పుచ్చుకోవటానికి నలుగురు బ్రహ్మలు బంగారు వలతో సిద్ధంగా ఉన్నారనీ, సిద్ధార్థుడు పుట్టిన వెంటనే ఏడు అడుగులు వేశాడనీ, అతడు సంసారాన్ని వదలితే బుద్ధుడౌతాడనీ, లేకుంటే ప్రపంచాన్నేలే చక్రవర్తి అవుతాడని అసితుడు చెప్పిన జోస్యం మొదలైన వివరాలు చోటు చేసుకొన్నాయి.

సిద్ధార్థుడు నాలుగు ప్రాపంచిక దృశ్యాలను చూచి చలించి సంసారాన్ని విడిచిపెట్టి, బోధివృక్షం క్రింద పరిపూర్ణ జ్ఞాని కావటం, తరువాత దుఃఖం లేని శాశ్వతమైన ఆనందాన్నిచ్చే ధార్మిక జీవితాన్ని బోధిస్తూ 80వ ఏట పరినిర్వాణం చెందటం మొదలైన వివరాలు లలిత విస్తరంలో విపులంగా ఉన్నాయి. సిద్ధార్థుడు జన్మించిన లుంబినీ, సంయక్సంబుద్ధత్వం ప్రాప్తించిన బుద్ధగయ, మొదటి ధార్మిక ప్రసంగం చేసిన సారనాథ్, మహా పరినిర్వాణం పొందిన కుసినార ఇంకా బుద్ధుడు సంచరించిన ఇతర పట్టణాలు, ప్రదేశాలు బౌద్ధులకు దర్శనీయ స్థలాలైనాయి. బుద్ధుని జీవితంతో ముడిపడి ఉన్న ప్రదేశాల్ని సందర్శించిన అశోక చక్రవర్తి ఆయా ప్రదేశాల్లో ఆ మహానుభావుని స్మృతికి చిహ్నాలుగా స్థంభాలను నాటి వాటిపై ధమ్మశాసనాలను చెక్కించటంతో ఆ ప్రదేశాలకు మరింత ప్రాచుర్యం లభించింది.

సిద్ధార్థుడు పుట్టిన లుంబినీ వనాన్ని చీనీ దేశపు భిక్షుక యాత్రికులైన హ్యూయన్ త్సాంగ్, ఫాహియాన్‌లు సందర్శించి, ఎన్నోస్థూపాలు, చైత్యాలు, విహారాలతో నిండి, చుట్టూ సుందరతర ప్రకృతితో అలరారే లుంబినిని భూతల స్వర్గంగా కొనియాడారు. ప్రపంచంలోని బౌద్ధులందరూ ఒక్కసారైనా దర్శించాలనుకొనే లుంబినీ వనంలో సిద్ధార్థుడు పుట్టిన చోటును గుర్తించాలనే తపన అటు బౌద్ధ భిక్షువుల్లోనూ, ఇటు చారిత్రక పరిశోధకుల్లోనూ బయలుదేరింది. క్రీ.పూ. 3 నుంచి క్రీ.శ. 10వ శతాబ్దం వరకూ ప్రముఖ బౌద్ధక్షేత్రంగా విరాజిల్లిన లుంబినీ వనం, దాదాపు వెయ్యేళ్ళపాటు మరుగున పడింది. 1886వ సం॥ డిసెంబరు 1వ తేదీ లుంబినీ చరిత్రలో ఒక మరపురాని రోజు. పాడుబడ్డ దిబ్బల్లో పరిశోధనలు సాగించిన జర్మన్ పురాతత్వవేత్త డా. ప్యూరర్ అక్కడి పురాస్థలంలో అశోకుని శాసనమున్న శిలా స్థంబాన్ని కనుగొనటంతో ఆ ప్రదేశాన్ని లుంబినిగా గుర్తించటానికి వీలుచిక్కింది. మధ్యయుగాలకు చెందిన మాయాదేవి ఆలయ పునాదుల్లో మాయాదేవి, సిద్ధార్థుడు, బ్రహ్మ ఉన్న శిలా ఫలకాన్ని కూడా ఆయన వెలికి తెచ్చాడు.

జపాన్ బుద్దిస్ట్ ఫెడరేషన్, నేపాలు ప్రభుత్వం సంయుక్తంగా లుంబినీ వద్ద తవ్వకాలు జరిపాయి. 1992లో మాయాదేవి ఆలయాన్ని, శిల్పాన్ని తొలగించి తవ్వకాలు కొనసాగించిన జపాన్ బుద్దిస్ట్‌ఫెడరేషన్ నిపుణలకు 1995లో ఆలయంలోపల ఒక రాయి కన్పించింది. ఆరాయి మీదే సిద్ధార్థుడు జన్మించాడనీ, అందువల్లే దానిపై మాయాదేవికి ఆలయం కట్టారనీ, దానికి సమీపంలోనే

అశోకుని శిలాశాసనం ఉందనీ, ఇవన్నీ కలిసి సిద్ధార్థుడు పుట్టిన చోటును నిర్ధారించటానికి తోడ్పడుతున్నాయని పురావస్తు నిపుణులు అంటున్నారు. సతోరు ఓసక అనే జపాన్ ఆర్కియాలజిస్టు ఈ రాయిపైన శాసనం లేనప్పటికీ, దానిపైన అశోకుడు కొయ్యతో ఆలయాన్ని నిర్మించి ఉంటాడనీ, తరువాతి కాలంతో అదే మాయాదేవి ఆలయంగా రూపు దిద్దుకొందనీ కాబట్టి ఈ రాతిమీదనే సిద్ధార్థుని జననం జరిగిందనీ పేర్కొన్నారు.

ఈ వార్త వెలువడిన తరువాత లుంబినికి వేలసంఖ్యలో బౌద్ధ భిక్షువులు తరలిరావటంతో, లుంబినీని ఒక ప్రామాణిక బౌద్ధ క్షేత్రంగా అభివృద్ధి చేయటానికి లుంబినీ ప్రాజెక్టును ప్రారంభించారు. 1978లో జపాన్ ఆర్కిటెక్టు కెంజో తంగే, రూపొందించిన ఈ ప్రణాళికకోసం జపాన్‌కు చెందిన రూయ్యాకై సంస్థ దాదాపు 11 మిలియన్ల డాలర్లు ఖర్చు చేసి లుంబినీ ఇంటర్నేషనల్ రిసర్చి ఇన్‌స్టిట్యూట్, లైబ్రరీ, వసతి గృహం ఇంకా ఇతర సదుపాయాలు కల్పించారు. టిబెట్టు, జపాన్, నేపాలు ప్రభుత్వాల ఆధ్వర్యంలో లుంబినీ ఒకగొప్ప పర్యాటక కేంద్రంగా రూపు దిద్దుకొంటుంది.

## బౌద్ధంలో లాస్యం

**– అన్నపరెడ్డి వెకంటేశ్వర రెడ్డి**

బౌద్ధం ప్రకారం నవ్వు ఆరురకాలు :

1. సిత లాస్యం : దాని అంతట అది వదనంలోను, ఆవిష్కరణలోను అభివ్యక్తమయ్యేది.
2. హసిత లాస్యం : పళ్ళు కనిపించేట్లుగా పెదవులు అల్పంగా కదలడం.
3. విహసిత లాస్యం : కొంచెంగా శబ్దం పైకి వచ్చే నవ్వు.
4. ఉపహసిత లాస్యం : తల, భుజాలు, చేతులు కదలికలతో గూడిన నవ్వు.
5. అపహసిత లాస్యం : కన్నీటితో కలిసి వచ్చే నవ్వు
6. అతిహసిత లాస్యం : ఆపాదమస్తకం ముందుకు వెనక్కు శరీరం ఊగడంతో పాటు భళ్ళున వచ్చే నవ్వు.

ఈ విధంగా లాస్యం అనేది శారీరకాభివ్యక్తి. ఇది వాచాభివ్యక్తితో కలిసిగాని లేక విడిగా గాని ఉండవచ్చు. వీటిల్లో మొదటి రెండింటిని సంస్కారవంతులు, తరువాతి రెండింటిని సగటు మనుషులు, చివరి రెండింటిని, అధోవర్గ జీవులు ప్రదర్శిస్తారు.

(అభిధమ్మం నుంచి)

# అంతర్వాచకత్వం

- బి. తిరుపతిరావు

అంతర్వాచకత్వం (intertextuality) అంతర్ వాచకత్వం అనే భావన ఫ్రాన్స్‌లో 1960లలో మొదలయింది. క్రమంగా ఇది ఒక సాహిత్య వాచకం ఎలా రూపొందుతుంది, అర్థాన్ని ఎలా పొందుతుంది అనే అంశాలకి సంబంధించిన ఒకానొక ఆలోచనా పద్ధతికి గుర్తింపబడుతోంది. ఫ్రాన్స్‌కే చెంది స్త్రీ వాద తాత్వవేత్త జూలియ క్రిస్తీవా ఈ పదాన్ని మొదటగా ఉపయోగించారు. ప్రముఖ భాషా శాస్త్రవేత మిఖాల్ భక్తిన్ ఒక భాషణకి వేరొక భాషణకి అనివార్యంగా వుండే సంబంధాన్ని గురించి చేసిన సూత్రీకరణ ప్రేరణలోంచి క్రిస్తీవా ఈ పదాన్ని రూపొందించారు. ఏ సాహిత్య వాచకమూ ఇతర సాహిత్య వాచకాలతో ఏమాత్రము సంబంధం లేకుండా వుండే వీలులేదు. ప్రతి వాచకమూ కొన్ని రూపాంతరం చెందించటం ద్వారా మరొక కొత్తవాచకం అస్తిత్వంలోకి రాగలుగుతుంది. ఈ ప్రతిపాదనలతో క్రిస్తీవా 1966 తరువాత ఈ పదాన్ని విస్తృత ప్రచారం చేశారు. నిర్మాణవాద సాహిత్య పరిశీలనల్లో, పరిభాషలో ఈ పదం చాలా కీలకాంశమైంది.

ఒక రకంగా రోలా బార్త్ ప్రతిపాదనకి అంతర్ వాచకత్వానికి కూడా సంబంధం వుంది. బార్త్ ప్రతివాచకము ఒక నెట్‌వర్క్ నని ప్రకటించాడు. ప్రతివాచకమూ బహుళ వాచకాల సమ్మేళనం. అంతకుముందే రాయబడిన వాచకాలు ప్రతికొత్తవాచకంలోకి ఏదో ఒక రూపంలో ప్రవేసిస్తాయి. ఈ క్రమంలో రచయిత అనేవాడు ఒక సమ్మేళనకారుడు మాత్రమే. భాషా సంబంధ ముడి పదార్థాలకి రచయిత ఒక నిర్దిష్ట రూపమిస్తాడు. ఈ అర్థంలో సాహిత్యం ఒక రకంగా పునర్లేఖన క్రమంగా వుంటుంది. పౌరాణిక కథలు రకరకాల రూపాల్లో నిరంతరం కొనసాగుతూ వుండటం ఇందుకొక ఉదాహరణ. 'కొత్తశైలిలో వుండే ప్రతినవల కొత్తగా చేర్చబడ్డ భావాలతో పాతదే... అలాగే మతమూ ఇంకా అనేక విషయాలు' అని అనే అన్నాడు ప్రముఖ ఆంగ్ల నవలా రచయిత థామస్ హార్డీ. 'ఏ వాచకమయినా పాత ఉల్లేఖనాల కొత్త కణజాలమే' అని ప్రకటించాడు రోలాబార్త్. ఈ అర్థంలో 'వాచకత్వం అనేది ప్రవచనాత్మక చక్రభ్రమణం' లాంటిది అంటాడు రోజర్ వెబ్‌స్టర్. 'ఒక రచన ఇతర రచనల లేక పుస్తకాల ఉల్లేఖనాల వ్యవస్థలో చిక్కుకుని వుంటుందన్నాడు' మిషేల్‌ఫుకో.

అంతర్ వాచకత్వానికి సంబంధించిన క్రిస్తీవా ప్రతిపాదనలు మనోవైజ్ఞానిక శాస్త్రం దాకా విస్తరించాయి. ముఖ్యంగా విషయి స్థిరత్వానికి సంబంధించిన మౌలిక ప్రశ్నలు వేశాయి.

దృగ్విషయ శాస్త్ర, విమర్శ (Phenomenological Criticism) సాహిత్య విమర్శలో ఇదొక పద్ధతి. ఒక రచనకి వెనుక వుండే రచయిత మూర్తిమత్వాన్ని తెలుసుకోవటానికి ఈ తరహా విమర్శ ప్రయత్నిస్తుంది. అంటే రచన మీద కంటే రచయిత మీద ఈ పద్ధతి ఎక్కువగా దృష్టికేంద్రీకరిస్తుంది.

ఒక రకంగా ఈ పద్ధతి రచన ద్వారా రచయితని తెలుసుకునే ప్రయత్నం చేస్తుంది. ఆ క్రమంలో జీవిత కథకి విమర్శకి మధ్యవున్న అగాధాన్ని అధిగమించటానికి ప్రయత్నిస్తుంది. రచనలో రచయిత మనో ప్రపంచపు రూపాన్ని అవగతం చేసుకోవటం ఈ తరహా విమర్శ లక్ష్యం.

దృగ్విషయశాస్త్రానికి ఆధ్యుడుగా జర్మన్ తాత్వికుడు ఎడ్మండ్ హుస్సెరల్‌ని చెప్తారు. హుస్సెరల్ దృగ్విషయశాస్త్రాన్ని మానవ చేతనని వర్ణించటానికి లేక నిర్వచించటానికి చేసే ప్రయత్నంగా చూశాడు. అయితే దృగ్విషయశాస్త్ర విమర్శ ఒక ప్రత్యేక లేక అనుపమాన రచయిత చేతనని అవగతం చేసుకునే ప్రయత్నంగా వుంటుంది. జెనివా స్కూల్‌గా పిలవబడ్డ విమర్శకులు ఈ తరహా విమర్శని ఎక్కువగా ప్రచారం చేశారు. వాళ్ళలో జార్జెస్ పౌలెట్ (**Yeorges Poulet**) ప్రముఖుడు. వీళ్ళ దృష్టిలో విమర్శకుడనేవాడు ఒక వాచకాన్ని చదవబోయేముందు తన మనస్సులో ఏ విధమయిన అభిప్రాయాలు ఆ రచనకు సంబంధించి వుంచుకోకూడదు. వాచకానికి ప్రత్యక్షంగా స్పందించటం ద్వారా ఆ వాచక రచయిత చేతనని, దాని ప్రత్యేకతని అవగతం చేసుకోవటానికి ఆస్కారం వుంటుంది. ముందే ఏర్పర్చుకున్న భావాల్ని వొదిలించుకుని వాచకాన్ని చదవటం వల్ల పాఠకుడు లేదా విమర్శకుడు రచన చేతనా పద్ధతిలో భాగస్వామి కాగలుగుతాడు. దాన్నే ఒక అంశానికి సంబంధించిన చేతన గురించిన చేతన అన్నారు.

రచయిత మూర్తిమత్వాన్ని లేక ప్రత్యేక మనోస్థితిని లేక ఒక రచన చేయటం వెనుక రచయితకుండే ఉద్దేశ్యాన్ని లక్ష్యాన్ని అవగతం చేసుకోవటం విమర్శకుని పనిగా భావించే దృగ్విషయశాస్త్ర విమర్శకులు అంతిమంగా ఒకానొక కాల్పనిక భావనలోనే మిగిలారు. ఇరవయ్యో శతాబ్దపు విమర్శలో రచయిత ప్రాపంచిక దృక్పథాన్ని అర్థం చేసుకోవటానికి చేసిన ప్రయత్నమే ఎక్కువ కనపడుతుంది తప్ప, రచయిత చేతనగురించిన చర్చ చాలా అరుదు. దృగ్విషయ శాస్త్ర విమర్శ రెండు రకాలుగా అసాధ్యమనిపిస్తుంది; ఒకటి పాఠకుడు తన మనసుని పూర్తి వస్తుగత దృష్టిలోకి తీసుకురావటం అసాధ్యం. రెండవది రచయిత చేతనని చేరుకునే ప్రయత్నంలో విమర్శకుడు ఆవిష్కరించేది తన చేతనే కానీ రచయిత చేతనని కాదు.

---

(130వ పేజీ తరువాయి)

***9.* ప్రపంచంలో ఆఖరి కమ్యూనిస్టు ఎక్కడుంటాడు?**

క) చైనా .చ) క్యూబా ట) విజయవాడ

***10.* వచన కవిత్వం ఎందుకు రాస్తారు?**

క) ఈ ఆధునిక యుగానికి అదే సరైనా కవితా మాధ్యమం.

చ) నిసర్గమైన కవిత అందులోనే సాధ్యం. ట) వచనం రాయలేరు గనక

మీపీ ధర్మజుడిపీ జవాబులు నూరు పాళ్లూ సరిపోవి వుంటాయ( ట)

# కవిత్వము - విశ్వజనీనత

## (1948 సం॥ నోబెల్ సాహిత్య పురస్కార స్వీకారోపన్యాసము)

మూలం :
**టి. యస్. ఇలియట్**

అనువాదము :
**డా. యు.ఏ. నరసింహమూర్తి**

ఈ సాయంత్రం నేనేమి చెప్పాలా అని ఆలోచించేను. స్వీడిష్ అకాడమీ నా కందిస్తూన్న ఈ మహోన్నత పురస్కారాన్ని సరళ సుందరంగా అభినందించడమొక్కటే ఇప్పటి కోరిక. కాని దీనిని నిర్వహించడం అంత తేలికకాదని ఋజువయింది. నాది వాగ్వ్యాపారం. కాని మాటలు ఇప్పుడు నా అధీనంలోలేవు. విశిష్ట సారస్వతేయులకు అరుదుగా లభించే అత్యున్నత అంతర్జాతీయ సాహిత్య పురస్కారం నాకు లభించిందన్న స్పృహను వ్యక్తీకరిస్తూ మాట్లాడవలసి ఉంటుందన్న సంగతి అందరికీ తెలిసినదే. ఇందుకు నేననర్హుణ్ణని చెప్తే స్వీడిష్ అకాడమీ విజ్ఞతను శంకించినట్లవుతుంది. సాహిత్య విమర్శకుణ్ణైన నేను ఈ సందర్భంలో స్వీడిష్ అకాడమీని ప్రశంసిస్తే కవిగా నాకు లభించిన గుర్తింపును ఆమోదించినట్లవుతుంది. నాకీ పురస్కారం లభించిందని తెలియగానే ఉద్రేకపు వెల్లువలో వివశుణ్ణయ్యాను. మానవమాత్రుడు ఇటువంటి సందర్భంలో అనుభవించగల అతిశయం నన్నావహించింది, అతిశయోక్తులకు ఆనందపరవశుణ్ణయ్యాను, వ్యతిరిక్తతను గమనించి ఉద్రిక్తుణ్ణయ్యాను, రాత్రికి రాత్రే ప్రపంచ ప్రఖ్యాతి పొందిన వ్యక్తిగా మారాను - అని చెప్పి దీని నంతటినీ అంగీకరించమని అడగమన్నారా? నోబెల్ పురస్కారం ఇంకొక పురస్కారంతో పోల్చదగినదే అయితే, ఇది కేవలం ఒక అత్యున్నత పురస్కారమే అయితే దీనినభినందించడానికి నేనింకా మాటలను వెతుక్కోవలసి వస్తుంది. కాని ఇది ఇంకొక పురస్కారంతో పోల్చదగినది కాదు. అందుకే ఈ అనుభూతులు తమ ఆవిష్కారం కోసం భాషను మించిన సాధనాలను పిలుస్తున్నాయి.

నోబెల్ సాహిత్య పురస్కార ప్రాధాన్యాన్ని నా దృష్టికోణం నుండి మీ ముందు ఉంచడానికి నన్ను నేను తప్పనిసరిగా అన్వయవ్యతిరేక మార్గంలో ఆవిష్కరించుకోవడానికి ప్రయత్నించవలసి ఉంటుంది. ఇది కేవలం శ్రేష్ఠతా నిర్ణాయకమైన పురస్కారమే, అయితే ఒక రచయిత పేరు ప్రతిష్ఠలు మాతృభాషా పరిధిని, స్వదేశపు సరిహద్దులను అధిగమించి విశ్వవ్యాప్తినందే మేరకే ఇది సత్యమైతే, ఇతరులకంటె ఎక్కువగా, మనలో ఏ ఒక్కరైనా ఏ సమయంలోనైనా గణనీయమైన ఈ ప్రఖ్యాతిని సాధించడానికి సమర్థులమే. కాని నోబెల్ పురస్కారమంటే అంతేకాదు. ఆపాటి గుర్తింపుమాత్రమే కాదు. అంతకంటె ఎక్కువైనది. అంతకంటె భిన్నమైనది. ఒక ప్రత్యేకమైన పాత్రను పోషించడానికి ఒక విశిష్ట ప్రతీకగా అవతరించడానికి, ఒక ఉదాత్తమైన ఎంపికలో, నిర్ణీతమైన కాలావధిలో ఏదో ఒక దేశం నుండి ఒక వ్యక్తిని వరించడం కంటె మించిన గొప్పతనమేదో నాకిందులో కనిపిస్తుంది. ఒక ప్రత్యేకమైన సభ చేస్తారు. అందులో అకస్మాత్తుగా అందరిముందు ఒక వ్యక్తిని తానంతకుముందు పూర్తి చేయని ఒక వ్యాపారంలో నియోగిస్తారు. సమూహం నుండి పృథక్కరింపబడడానికి అతడు యోగ్యుడా? కాడా? అన్నది

ప్రశ్నకాదు. మీరు ఏ స్థానంలో అతడిని నియోగించారో ఆ స్థానాన్నతడు సవ్యగ్రీతిలో నిర్వహించగలడా? లేడా? అన్నది ప్రశ్న. అతడెంతటి వాడైనా కానీయండి - తన రచనల విలువకంటె అనిర్వచనీయ గురుతర ప్రాధాన్యం కల ఆ వ్యాపార నిర్వహణకు ప్రతినిధిగా సేవలందించడానికి సమర్థుడు కాగలడా? అన్నది ప్రశ్న.

కళలన్నింటిలో కవిత్వం చాలా ప్రత్యేకమైనదని సర్వసాధారణంగా అంటారు. చిత్రకళ, శిల్పకళ, వాస్తుకళ, సంగీతం - చూసినా, విన్నా అందరికీ అనుభూతినిస్తాయి. కాని భాష - అందులోనూ కవిత్వపుభాష ఇందుకు చాలా భిన్నమైనది. కవిత్వం ప్రజలను ఏకం చెయ్యడంకంటె వేరుచేయగలదనే అనిపిస్తుంది.

అయితే ఇక్కడ ఇంకొక విషయం జ్ఞాపకముంచుకోవాలి. భాష ప్రజల మధ్య అడ్డుగోడగా నిలుస్తుంది. కవిత్వం తనంత తానుగా ఆ అడ్డుగోడను అధిగమించే మార్గం చూపిస్తుంది. ఇతర భాషా కవిత్వాన్ని చదివి ఆనందించడమంటే ఆ భాషా వ్యవహర్తలను అర్థం చేసుకుని ఆనందించడమే ఔతుంది. ఆ ఆనందాన్ని మనం ఇంకొక మార్గంలో పొందలేము. ఐరోపా కవిత్వ చరిత్రను గూర్చి మనం ఆలోచిస్తే ఒక భాషా కవిత్వం ఇంకొక భాషా కవిత్వంపై ఎంతటి గాఢ ముద్ర వేయగలదో తెలుస్తుంది. గుర్తింపుపొందిన ప్రతి కవి తన భాషలోని కవులకంటె ఇతర భాషా కవులకు ఎంతగా ఋణపడి ఉంటాడో మనం జ్ఞాపకం చేసుకోగలము, కవిత్వం ఏ దేశానికి చెందినదైనా, ఏ భాషకు చెందినదైనా అది ఇతర భాషల కవిత్వపు పెంపుపోషణలు లేకపోతే క్షీణించి నశించి పోతుందని మనకు తెలుస్తుంది. ఒక కవి తన ప్రజలనుద్దేశించి పలికిన పలుకుల్లో అతణ్ణి ప్రభావితుణ్ణి చేసిన ఇతర భాషల కవులు గొంతుకలన్నీ వినిపిస్తాయి. అదే సమయంలో ఆ కవి ఇతర భాషల యువకవులతో తనంతట తానుగా మాట్లాడగలడు. ఆ యువకవులు ఈ కవి జీవనదర్శనాన్ని ఈ దేశపు ప్రజల సజీవ చైతన్యాన్ని తమ ప్రజలకు అందజేయగలరు. ఇతర కవుల్ని ప్రభావితుల్ని చేయడం వలన కొంత, అనువాదాల వలన కొంత ( అనువాదమంటే పునస్సృజన), భావయిత్రీ శక్తి మాత్రమే గల తన భాషలోని పాఠకుల వలన కొంత భిన్న ప్రాంతాల ప్రజల మధ్య అవగాహనను పెంచడానికి కవి దోహదం చేయగలడు.

ప్రతి కవి కవిత్వంలోను నిశ్చయంగా తన ప్రాంతంలో నివసించేవారికి, తన భాష మాట్లాడేవారికి ఉద్దేశించినదే ఎక్కువగా ఉంటుంది. అదలా ఉంచితే 'ఐరోపా కవిత్వం' అనే పదబంధానికి ఒక అర్థం ఉంది. అలాగే 'కవిత్వం' అన్న దానికి కూడా ప్రపంచమంతటా ఒక అర్థం ఉంది! కవిత్వంలో భిన్నదేశాల, భిన్న భాషల ప్రజలు పరస్పరావగాహనను పెంచుకుంటారని నేననుకుంటాను. ఏదైనా ఒక దేశంలో ఇది అల్పసంఖ్యాకులకు పరిమితమైనదిగా కనిపించవచ్చును. ఎంతో కొంత పాక్షికం కావచ్చును. ఈ అవగాహన పెరగడం ఇంకా తప్పనిసరిగా అవసరం. నోబెల్ సాహిత్య పురస్కారాన్ని ఒక కవికి అందజేస్తున్న ఈ తరుణంలో ముఖ్యంగా కవిత్వపు విశ్వజనీన ప్రమాణాన్ని నొక్కిచెప్పడం కోసమే ఈ పురస్కారాన్ని నేను స్వీకరిస్తున్నాను. ఈ ప్రకటన చేయడానికి అప్పుడప్పుడు ఒక కవిని

ఈ స్థానంలో నిలిపి ఉంచడం అవసరం. నేనిప్పుడు ఇక్కడ నా వ్యక్తిగత ఉత్కర్ష కారణంగా నిలబడలేదు. ఒక కాలానికి ప్రతీకగా నిలబడ్డాను, కవిత్వానికి గుర్తింపుగా నిలబడ్డాను.

## సమర్పణ

(ఏండర్స్ ఆస్టర్లింగ్, స్వీడిష్ అకాడమీ శాశ్వత కార్యదర్శి)

నోబెల్ సాహిత్యపురస్కారాన్ని పొంది మన మనసుకెక్కిన విజేతల పరంపరకంటె టి. యస్. ఇలియట్ అసాధారణమైన వాడు. ఆత్యంతికంగా ఈ శ్రేష్ఠతను పొందే రచయితల కోవలోని వాడు కాడాయన. వారిలో ఎక్కువ మంది ప్రజాసహమతిని ఆశించే సహజసంబంధాలతో కూడిన సాహిత్యానికి ప్రతినిధులు. వారంతా ఈ లక్ష్యసాధనకు తమకు అందుబాటులో సిద్ధంగా ఉన్న మాధ్యమాలను ఉపయోగించుకుంటారు. ఇలియట్ అందుకు భిన్నమైన మార్గాన్ని ఎంచుకున్నాడు. ఆయన జీవనసరళి విలక్షణమైనది. పూర్తిగా అనితర సామాన్యమైనది. బుద్ధిపూర్వకంగా వేరుపడినది. ఆయన క్రమంగా అత్యంత దూరగామియైన ప్రభావాన్ని చూపించగలిగేడు. మొదట్లో ఆయన తనకు తానే చెప్పుకున్నట్లు, ఒక పరిమిత రహస్య సంఘపు సభ్యులనుద్దేశించి చెప్తున్నట్లు కనిపించేవాడు. క్రమంగా తన అంగీకారంతో సంబంధం లేకుండానే ఈ పరిధి విస్తరించింది. అందుకే ఇలియట్ పద్యంలోను, వచనంలోను ఒక అతి విశిష్టస్వరం ఉంటుంది. మన తరం స్పృహను చీల్చుకునిపోయే వజ్ర నిశితమైన సామర్థ్యం గల ఆస్వరం మన కాలంలోనే మన అవధానాన్ని నిలదీస్తుంది.

సమకాలీన నాగరికతలో కవులు దురూహాలుగా ఉన్నారని ఇలియట్ ఒక వ్యాసంలో పేర్కొన్నాడు. ''మన నాగరకత ఎంతో వైవిధ్యంతోను, ఎంతో సంక్లిష్టతతోను నిండి వుంది. ఈ వైవిధ్యం, ఈ సంక్లిష్టత సున్నిత మనస్తత్వాలపై ప్రసరించడం ద్వారా తప్పనిసరిగా వివిధమైన, సంక్లిష్టమైన ఫలితాలనిస్తాయి. భాషను తన కోరిన అర్థంలోకి ఈడ్చుకుని రావడానికి, అవసరమైతే దాని కీలు తప్పించడానికి కవికి చాలాచాలా అవగాహన ఉండాలి; పరోక్ష సూచన **(Allusive)** లుండాలి, పరోక్ష మార్గం పట్టాలి'' అంటాడాయన.

ఈ ప్రకటన నలా వెనక్కు పెట్టి మనం ఇలియట్ సాధించిన ఫలితాలను పరీక్షించవచ్చును. ఆయన అందించిన సాహిత్య ప్రాధాన్యాన్ని అర్థం చేసుకునే అధ్యయనాన్ని చేపట్టవచ్చును. ఆయన ప్రయత్నం విలువైనది. 1922 '' ఊసరక్షేత్రం'' **(The Waste Land)** అనే కావ్యరచనతో ఇలియట్ కవిత్వంలో సర్వశ్రేష్ఠమైన ప్రయోగంచేసి గణనకెక్కేడు. సంక్లిష్ట ప్రతీకాత్మకమైన భాష, రంగులగచ్చు లాంటి నిబిడ సాంకేతిక నిర్మితి, జ్ఞాన సంపన్నమైన పరోక్షసూచనాసామగ్రి కారణంగా ఆ కావ్యం ఎటుచూసినా గాభరాపుట్టించేలా ఉంటుంది. ఐరిష్ రచయిత అయిన జేమ్స్ జాయిస్ ఇదే సంవత్సరంలో కొత్త పుంతను తొక్కి 'యులిసిస్' **(Ulysses)** అనే నవలారచనతో ఆధునిక సాహిత్యంలో సంచలనాన్ని సృష్టించి, సుదీర్ఘ చర్చలకు కారకుడైన సంగతి ఇక్కడ మనం గుర్తుకు తెచ్చుకోవాలి. ఇది ఎంతమాత్రం

కాకతాళీయం కాదు. 1920లలో వచ్చిన ఈ రెండు రచనలు అంతశ్చేతనలోను, సంఘటనరీతిలలోను ఒక దాని నొకటి పోలి ఉన్నాయి. దురవగాహము, ప్రతిభామహితము అయిన పదసంయోజనరీతి చరమంగా దాని రహస్యాలను వెల్లడించేదాకా, వెన్నులో వణకు పుట్టించే '' ఊసరక్షేత్రం'' (The Waste Land) అనే కావ్యనామంలోని నిగూఢతను ఎవడికి వాడు అనుభవించవలసినదే కాని, ఒకరు వివరించదగినది కాదు. పర్యాయ ప్రచలిత వాస్తవిక - ఐతిహాసిక గాథాపరంపర తమ దృక్కోణంలోని వర్ణనాతీత సమగ్ర ఫలితాలను పరస్పరం గాఢంగా ముద్రించుకుంటూ, ఆధునిక నాగరకతలోని వంధ్యత్వాన్ని, నపుంసకత్వాన్ని వర్ణించడమే లక్ష్యంగా ఈ కావ్యంలో ఒక విషాదం, ఒకగాజుతెరపరువళ్ళు తొక్కాయి. ఈ కావ్యంలో ఉన్నవి 436 పాదావే. కాని వందల పుటంలో కిక్కిరిసిపోయిన నవలలో కంటె ఎక్కువ విషయం ఇందులో వుంది. '' ఊసరక్షేత్రం'' పాతికేళ్లకిందటి రచన. కాని దురదృష్ట వశాత్తు నేటి అణుయుగపు నీడలో దాని విధ్వంసక దార్శనికత ఉజ్జ్వల వాస్తవికతగా నిరూపితమయింది.

ఇలియట్ వ్యథానివిష్టమైన, పరిష్కారాన్వేషణాభరితమైన వస్తువుతో, చెదరని నిశితమేధతో పరంపరగా కవితాసృష్టి కొనసాగించేడు. వ్యవస్థ, అర్థం, అందం లేని ఈ మతాతీత ప్రపంచంలోని ఆధునిక మానవుని భయానకశూన్యత్వం ఇక్కడ నిస్పృహ నిండిన చిత్తశుద్ధితో కనిపిస్తుంది. ఇలియట్ ఇటీవల రచించిన Four Quartets (1943)లో ఇంచుమించుగా నియత బహిరంగ క్రైస్తవ ప్రార్థనలలోని పల్లవులతో, స్పష్ట - నిర్దుష్ట ఆధ్యాత్మికానుభవ అభివ్యక్తులతో, ధ్యానసంగతి గల శబ్దసంగీతాన్ని అందుకున్నాడు. అతని ప్రపంచ చిత్రంలోని అలౌకిక దివ్యభవనం నిరంతర స్పష్టతరంగా నిర్మితమయింది. మౌలికపాపాన్ని (Original Sin) గూర్చిన క్రైస్తవ విశ్వాసం ఒకటుంది. అనుల్లంఘనీయమైన విధిని గూర్చి చెప్పిన గ్రీకు ఇతిహాసాలున్నాయి. ఈ రెండూ పరస్పర విరుద్ధమైనవి. పరస్పర భిన్నమైన ఈ ఊహలను వాటికి పరిపూర్ణంగా భిన్నమైన ఆధునిక వాతావరణంలోని ఇంగ్లండు ఉత్తర ప్రాంతంలోని ఒక పల్లెకొంపలోని దృశ్యంలో నిబంధిస్తూ, ఇలియట్ సాహసోపేతంగా కేంటర్‌బరీ థామస్‌కు సంబంధించిన చారిత్రికేతివృత్తంతో Murder in the Cathedral (1935) అనే నాటకాన్ని, "The Family Reunion' (1939) అనే నాటకాన్ని రాసేడు. ఆయన నాటకాలలో ఋజుమార్గంలో, మార్గదర్శకమైన సందేశం ప్రకటంగా పుట్టుకొస్తుంది.

ఇలియట్ కవిత్వం రాశిలో ఎక్కువ కాదు. కాని అది ఇప్పుడు దిక్చక్రానికి ఎదురునిలిచి, సముద్రంలోంచి ఉద్భవించిన ఒక శిలాశిఖరంలా ఉంది. నిర్వివాదంగా అది ఒక మైలురాయి. కొన్ని సమయాల్లో అది మార్మిక దేవాలయ శిఖరాల రూపుదాలుస్తుంది. నిశ్చలబాధ్యత, అసాధారణ ఆత్మసంయమనం అనే ముద్రపడిన కవిత్వమది. రొడ్డగొట్టు ఉద్రేకాలకు అది దూరంగా ఉంటుంది. దాని గురి సమస్తం అత్యవసరవస్తువుల మీదే నిలుస్తుంది. అది బింకంగా, కఠినంగా, నిరలంకారంగా ఉంటుంది. కాని అప్పుడప్పుడు అనియత కాలావధిలోని అద్భుతాలు - రహస్యాలను వెలికితీసే మహిమల హఠాత్ కిరణ ప్రసారంతో అది జాజ్జ్వల్యమాన మౌతుంది.

ఇలియట్‌ను తరచిచూస్తే చివరిదాకా తప్పనిసరిగా పరిష్కరించదగిన కొన్ని సమస్యలు కనిపిస్తాయి. అదే సమయంలో రెచ్చగొట్టే అవరోధాలు కూడా కనిపిస్తాయి. కవిత్వపు రూపాన్ని సమూలంగా సంస్కరించిన అగ్రగామి, సమకాలీన కవితాశైలిలో పరిపూర్ణ విప్లవాన్ని ప్రారంభించినవాడు ఇలియట్. ఇందుకు విరుద్ధంగా ఇదే ఇలియట్ చారిత్రక దృక్కోణాలను, మన ఉనికికి స్థిరనియమాల అవసరాన్ని, నొక్కి-చెప్తూ హేతువుకందని తర్కానికి చిక్కని సిద్ధాంతకర్తగా కనిపిస్తాడు. ఇంచుమించుగా 1940ల నాటికే ఆయన మతపరంగా ఆంగ్లికన్ చర్చి (Anglican Church) ని, సాహిత్యపరంగా ఐతిహాసికతను సమర్థించేవాడిగా మారిపోయాడు. కాలం ప్రమాణీకరించిన ఈ ఆదర్శాలకు తిరోగమించే ఇలియట్ జీవనతత్త్వసరళి ఆయన ఆధునిక ఆచరణలతోను, సాంప్రదాయిక సిద్ధాంతంతోను సంఘర్షిస్తోంది. ఇదొక కొరకరాని వాస్తవం. అయితే రచయితగా తనకున్న సామర్థ్యంతో నిరంతరాయమైన భిన్న విజయాలతో ఈ అగాధానికి ఆయన వంతెన వేయగలిగాడు. ఆ వంతెన ఉనికి బహుశా అతనిని బాధించేదయినా పూర్తిగా అతని స్పృహలో నిలిచే ఉంటుంది. మొదట ఆయన కవిత్వం తలాతోకానిలవని శిథిలబంధంగా ఉండేది. రూపసంబంధమైన సాంకేతిక నిర్మితిపట్ల మొదలంటా నిబ్బరమైన ఎదురుదాడి చేసింది. అయితే దానిని మనం విసుగుదలనుండి, వైరాగ్యం నుండి తనను తాను వదలించుకుని ఉన్నతము, స్వచ్ఛము అయిన సత్యాలను గుర్తించే బౌద్ధిక అభివ్యక్తి సంబంధమైన అన్వయ వ్యతిరేకమార్గంగా అర్థం చేసుకోవచ్చును. ఇంకోలా చెప్పాలంటే అది ఒక క్రైస్తవకవి తిరుగుబాటు. మొత్తం మీద ఈ సందర్భంలో ఇలియట్ మతానికి సంబంధించినంతమేరకు కవిత్వపు శక్తి బలీయం కాకుండా జాగ్రత్త పడినట్లు కూడా మనకు తెలుస్తుంది. ఒకచోట ఇలియట్ కవిత్వం వాస్తవంగా మన ఆంతరజీవనం కోసం నిర్వహించే వ్యాపారాన్ని మెలకువతో ఆచితూచి చెప్తూ ''అది మన ఉనికిలోని అగాధములు, అపరిచితములు అయిన అనుభూతుల పట్ల మనం కొంచెం జాగృతుల మయేలా చేస్తుంది. అందులోకి మనం చొచ్చుకుని పోవడం చాలా అరుదు. మన బ్రతుకులన్నీ నిరంతరం మన నుండి తప్పుకునిపోయేవే'' అన్నాడు.

ఇలియట్ తాత్త్వికస్థితి కేవలం సంప్రదాయంమీద ఆధారపడినదని అంగీకరిస్తే, నేటి చర్చల్లో తానుద్దేశించిన 'సంప్రదాయం' అనే మాట ప్రకరణ విరుద్ధంగా ఉపయోగింపబడుతూందని ఆయన పదేపదే ఎత్తిచూపిన సంగతిని కూడా మన మనసులో ఉంచుకోవాలి. 'సంప్రదాయం' అన్నమాటలోనే అది స్థిర ప్రకృతి కలది కాదని, చల ప్రకృతి కలదని, నిరంతరం ఏదో ఒక దానిని ఇతరులకు అందించి తనలో గర్భీకరించుకునేదనే అర్థం ఇమిడి వుంది. కవితా సంప్రదాయంలో కూడా ఈ సజీవ సూత్రం నిలిచే వుంది. ఇంతవరకు రచింపబడిన మహాగ్రంథాలు ఒక ఆదర్శ వ్యవస్థను రూపొందిస్తాయి. కొత్తగా ఒక మహాగ్రంథం వచ్చినప్పుడల్లా ఆ పరంపరలో చిన్నచిన్న మార్పులు జతకూడుతూ ఉంటాయి. వంతులు, విలువలు ఎడతెగకుండా మారుతూనే ఉంటాయి. పాతదనం కొత్తదనానికి త్రోవ చూపించినట్లే, ఒకప్పుడు కొత్తదనంకూడా పాతదనానికి దిశానిర్దేశకంగా ఉంటుంది. ఈ సంగతిని గుర్తించిన కవి తప్పనిసరిగా తనకు కష్టాలకు, బాధ్యతలకు ఎదురయ్యే అవకాశాన్ని కూడా గుర్తించాలి.

ఇలియట్‌కు అరవైయేళ్ల వయసు దాటింది. నిజ జీవితంలో కూడా ఆయన అమెరికాను వదలి పురాతనమైనది, ఆటుపోట్లకు ఎదురు నిలిచినది, మాన్యమైనది, సాంస్కృతిక సంప్రదాయాలకు పుట్టినిల్లు - అయిన యూరోపు చేరుకున్నాడు. ఇలియట్ పూర్వీకులు ప్రొటెస్టెంటు క్రైస్తవులు. 17వ శతాబ్దంలో వారు అమెరికాకు వలసపోయేరు. బోస్టన్‌లో పుట్టి సార్బోన్, మార్‌బర్గ్, ఆక్స్‌ఫర్డ్‌లలో చదువుకునే యౌవనదశలోనే తాను సనాతన ప్రపంచ చారిత్రిక వాతావరణానికి సన్నిహితుణ్ణని ఆయన గ్రహించేడు. ఆయన 1927 నుండి బ్రిటిష్ పౌరుడు.

ఈ పురస్కార సమర్పణ సందర్భంలో రచయితగా ఇలియట్ వ్యక్తిత్వంలోని కొట్టొచ్చినట్లు కనబడే తక్షణ ఆకర్షక లక్షణాలను కొన్నింటిని రేఖామాత్రంగా చూపగలమే గాని ఆయనలోని సంక్లిష్ట బహుముఖీనతను వివరించడం సాధ్యం కాదు. ఆయనలో అన్నింటినీ మించినది ఉన్నతము, తాత్త్వికనేపథ్యంలో వికసించినది ఆయన మేధ. ఊహలోను, అధ్యయనంలోను, గ్రహణంలోను, ఊహల విశ్లేషణలోను చొరబడి ఆయన మేధ విజయకేతనాన్ని ఎగురవేసింది. మేధోపరంగాను, సౌందర్య శాస్త్ర పరంగాను ఎదురయ్యే చిక్కు ప్రశ్నల పునర్విచారాన్ని ప్రేరేపణ చేయడంలో ఇలియట్ సామర్థ్యం అసాధారణమైనది. విలువ కట్టడంలో తేడాలుంటే ఉండవచ్చును గాని ఆయన జీవిత కాలంలో ఆయన చిక్కుప్రశ్నలను లేవనెత్తడంలో గణుతికెక్కిన వాడన్న విషయాన్ని మాత్రము విస్మరించలేము.

డాంటే రచన మీద, వ్యక్తిత్వం మీద ఇలియట్ సర్వశ్రేష్ఠమైన రచన చేయడం యాదృచ్ఛికం కాదు. అతని అత్యంత నైతిక శబలతలోను, ఆధ్యాత్మిక చింతన సరళిలోను, మతావిష్టమైన ప్రపంచవ్యవస్థను కోరుకునే తహతహలోను - ఇలియట్ డాంటేతో కొంత సారూప్యాన్ని కలిగివున్నాడు. విభిన్న ప్రకృతులకు నెలవైన తననాటి వాతావరణంలో ఇలియట్‌ను డాంటే అధునాతన వారసుడిగా గుర్తించడం అతని గౌరవానికి కలికితురాయి కాగలదు. అతని సందేశంలో పూర్వయుగాల సనాతన చింతన ప్రతిధ్వనులు మనకు వినిపిస్తాయి. కాని, ఎలాచూసినా, తన కాలానికి, ఇప్పుడు నివసించే మనకోసం వినిపించిన ఆ సందేశం ఏమాత్రము అవాస్తవికమైనది కాదు.

మిస్టర్ ఇలియట్! ఈ ప్రశంసాపత్రాన్ననుసరించి ఈ పురస్కారం ముఖ్యంగా ఆధునిక కవితా రంగంలో పథప్రవర్తకునిగా గణనీయమైన విజయాలను సాధించినందుకు మీకు అందజేయ బడుతూంది. అందుకే ఈ దేశంలోని శ్రద్ధాళువులైన చదువరులచే ఆరాధింపబడిన మీ ప్రధాన కవితా వ్యాసంగ సంగ్రహ స్వరూపాన్నందించడానికి నేను ప్రయత్నించాను.

సరిగ్గా 25 సంవత్సరాల కింద తన మాతృభాషయైన ఆంగ్లంలో కవిత్వం వ్రాసి ప్రఖ్యాతులైన విలియమ్ బట్లర్ ఈట్సు మీరు నిలుచున్న ఈ స్థలంలోనే నిలుచున్నారు. కవితా ప్రపంచపు నూతన యుగ నాయకునిగా, ఎదురులేని వీరునిగా గుర్తింపబడిన మీకు ఇప్పుడా గౌరవం లభిస్తూంది.

స్వీడిష్ అకాడమీ శుభాభినందనలతో కూడిన ఈ పురస్కారాన్ని మా దేశపు మాన్యయువరాజుల చేతి మీదుగా మీరు అందుకోవలసిందిగా కోరుతున్నాను.

★ ★ ★

టి. యస్. ఇలియట్ అంగీకారోపన్యాసానికి ముందుగా స్వీడిష్ అకాడమీ సభ్యుడు గుస్తాఫ్ హెల్ స్ట్రోమ్ (Gustaf Hellstrom) ఇలా ప్రసంగించేరు ''మిస్టర్ ఇలియట్! ఉదాత్త పురుషునిగా మీరిప్పుడు గౌరవింపబడడానికి మీ వ్యక్తిత్వ లక్షణాల్లోని వినీత లక్షణం ఒక కారణం. 'వినీతి అనే వివేకము ఒక్కటే మనం ప్రయత్న పూర్వకంగా సాధించగల వివేకము'. మీ దార్శనికతకు ఇది పార్యంతిక ఫలంగా కనబడదు. మీ ఆలోచనకు ఇది పరమావధికాదు. అగ్రసర మతివైభవం ఇప్పటికీ సజీవంగా నిలిచివున్న ప్రతీచీమధ్యమంలో (Middle West) జన్మించి, బోస్టన్ నగరంలో పెరిగి యౌవనంలో ఐరోపాలో ప్రవేశించారు. అక్కడ పాతలోకపు యుద్ధ పూర్వపు నాగరకతతో సంఘర్షించేరు. అప్పటికింకా యూరోపు ఏడవ ఎడ్వర్డు, కైజర్ విల్హెల్మ్, తృతీయ గణతంత్రం (Third Republic) సంతుష్ట వితంతువు (The Merry Widow) ప్రభావంలో ఉంది. ఈ సంబంధం మీకు కలిగించిన దిగ్భ్రమను మీరు మీ 'ఊసరక్షేత్రం' (The Waste Land) లో అచ్చుమచ్చుగా ప్రకటించేరు. అస్తవ్యస్త - అసభ్య స్థితికి చేరుకున్న నేటి నాగరకత ఆ కావ్యంలో మీ నిశిత విమర్శకు గురయింది. ఆ నిశిత విమర్శలో ఒక గాఢమైన, బాధా భరితమైన నిరాశ వుంది. ఆ నిరాశలోంచి ఒక అనుకంప పొటమరించింది. ఆ అనుకంపలోంచి అనిశ్చిత స్థితిలోని శిథిల నాగరకతా శకలాలను సంరంక్షించి ఒక వ్యవస్థను, నిలకడను ఉద్ధరించే ప్రగాఢ వాంఛ పుట్టింది. మీకంటె పాతికేళ్లు ముందుగా మానసిక వైద్య ప్రపంచంలో సిగ్మండ్ ఫ్రాయిడ్ ఆక్రమించుకున్న స్థానంతో, ఎంతో కాలంగా ఆధునిక సాహిత్య రంగంలో మీరు ఆక్రమించుకున్న స్థానాన్ని పోల్చి చూడాలనిపిస్తోంది. అలా పోల్చడానికి అనుమతిస్తే మానసిక విశ్లేషణలో ఫ్రాయిడ్‌వైద్య విదానంలో సాధించిన నవ్యతను మీ సందేశాన్ని ఆవరించుకున్న విప్లవాత్మకమైన కవితా రూపంతో జతపరచి చూడవచ్చును. ఈ సమతులన మార్గాన్నింకా ముందుకు కూడా కొనసాగించవచ్చును. మనిషి ఆదిమ సమాజాతాలను నిరంతర పరిగణనలోకి తీసుకునే ఫ్రాయిడ్ అభిప్రాయాన్ననుసరించి సామూహిక వ్యక్తిగత చైతన్యాల మధ్య సమతులనం తప్పనిసరిగా అవసరంగా కనిపిస్తుంది. మీ అభిప్రాయం ఇందుకు పూర్తిగా విరుద్ధమైనది సాంస్కృతిక సంప్రదాయ పరిరక్షణే మనిషికి పరిష్కారాన్నిస్తుందని, అది ఆదిమ సహజాతాలలో కంటె మానవ జాతి వికాసదశ లన్నింటిలో మహత్తర శక్తితో మనలోనే జీవించివుందని, ఈ అస్తవ్యస్త స్థితిని తప్పించుకోవాలంటే మనం సంప్రదాయాన్ని సంరంక్షించుకోక తప్పదని మీరంటారు. యావనోద్రేకాలలో మనం సంప్రదాయాన్ని తోసిరాజంటాము. కాని సంప్రదాయం మనం ఈడ్చుకుని పోయే శవపేటిక కాదు. భవిష్యత్సస్యాలకు బీజావాపన చేయదగిన భవ్యకేదార మది. అది రేపటి పంటల విత్తనాల గిడ్డంగి. మిస్టర్ ఇలియట్! ఒక కవిగా మీరు మీ సమకాలికుల మీద, సమకాలీన యువ కవులమీద మీ తోటి వారెవరూ అందుకోలేనంత ప్రభావాన్ని చూపించేరు.

**జీవిత చరిత్ర**

థామస్ స్టెర్న్ ఇలియట్ (1888-1965) మిసోరీలోని సెయింట్ లూయీస్‌లో పురాతన న్యూ ఇంగ్లండ్ కుటుంబంలో జన్మించేరు. హార్వర్డులో విద్యనభ్యసించేరు. సార్బోన్, హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్‌లోని మెర్టన్ కళాశాలలో తత్త్వశాస్త్రంలో పట్టభద్రత కోసం చదువుకొనసాగించేరు. ఇంగ్లండులో స్థిరపడ్డారు. అక్కడ కొంతకాలం బడిపంతులుగాను, బ్యాంకు గుమస్తాగాను పనిచేసేరు. ఆ తర్వాత ఫేబర్& ఫేబర్ ప్రచురణ సంస్థకు సాహిత్య సంపాదకుడిగా పనిచేసి, ఆ సంస్థకే డైర్టక్టరు అయ్యారు. క్రిటేరియన్ **(Criterion)** అనే కేవల సాహిత్య పత్రికను స్థాపించి, సంపాదకత్వం వహించి పదిహేడు సంవత్సరాలు (1922-1939) నడిపారు. ఇలియట్ 1927లో బ్రిటిష్ పౌరసత్వాన్ని పొంది ఆంగ్లికన్ చర్చి **(Anglican Church)** లో చేరేరు.

20వ శతాబ్దపు కవిత్వంలో నూతన రీతులను ఆవిష్కరించిన సాహసికులలో ఇలియట్ ఒకరు. అందరూ ఏమనుకుంటారో అనిగాని, ఇలాగైతే భాష ఒప్పుకుంటుందో లేదో అని గాని ఆయనెప్పుడూ రాజీపడలేదు. ఆధునిక నాగరికతలోని సంక్లిష్టతను, సంక్షిప్తతను కవిత్వం భాషాముఖంగా ప్రాతినిధ్యం వహించాలనే తన విశ్వాసాన్ని ఆయన అనుసరించేరు. అటువంటి ప్రాతినిధ్యం సహజంగా ప్రౌఢకవిత్వానికి దారితీస్తుంది. అంతటి ప్రౌఢిమ కలిగివున్నా ఇలియట్ కవిత్వం ఆధునిక కవిత్వం మీద ప్రగాఢ ముద్రవేసింది. **Prufrock** (1917) నుండి **Four Quartets** (1943) దాకా ఇలియట్ కవిత్వం ఒక క్రిస్టియన్ రచయిత పరిణతిని ప్రతిబింబిస్తుంది. ఆయన ప్రాథమిక రచన, మరీ ముఖ్యంగా **The Waste Land** (1922) పూర్తిగా విరుద్ధదిశలో వుంది. ఆ భయానక అభివ్యక్తిలో ఉదాత్త ప్రపంచ అన్వేషణ ఉద్బుద్ధమయింది. **Ash Wednesday** (1930) లోను **Four Quartets** లోను ఈ ఉదాత్త ప్రపంచం బాగా కంటికి ఆనింది. తాను మత ప్రచార కవిగా మారిపోకుండా ఇలియట్ చాలా జాగ్రత్తపడ్డాడు. కవిత్వపు శక్తి మత ప్రచారశక్తిగా మారిపోకుండా ఆయనెప్పుడూ దానిని తొక్కిపట్టి ఉంచేవాడు. అయితే ఆయన రాసిన **'Murder in The Cathedral' (1935), The Family Reunion (1939)** అనే నాటకాలు మాత్రం తేటతెల్లమైన క్రైస్తవ వాద వివరణాత్మక రచనలే. ఇలియట్ తన వ్యాసాలలో మరీ ముఖ్యంగా చివరి రచనలలో మతము - సమాజము - సాహిత్యము అనే రంగాలలో సంప్రదాయాన్ననుసరించాలని బోధించేడు. తాను పథప్రవర్తకుడైన కవితామార్గానికిది భిన్నంగా కనిపిస్తుంది. **'The Waste Land'** రాసిన కవి కంటె **'Notes Towards the Definition of Culture' (1948)** రాసిన ఇలియట్ ముసలివాడుగా కనిపించినా పరస్పర సంవాదంతో భూతభవిష్యద్వర్తమానాలను ఏకంచేసే సజీవ శక్తిగా సంప్రదాయాన్ని ఇలియట్ సమన్వయించిన విషయాన్ని మనం విస్మరించకూడదు. **Murder in The Cathedral (1935) The Family Reunion (1939) The Cocktail Party (1949) The Confidential Clerk (1954) The Elder Statesman (1959)** అనే ఇలియట్ నాటకాలు 1962లో ఒక సంపుటంగా వెలువడ్డాయి. 1909-62 మధ్య ఆయన రాసిన కవిత్వం **Collected Poems** గా 1965లో ప్రచురించబడింది.

# మారుతున్న ప్రపంచం - మాటల కూర్పులు

- శ్రీ విరించి

కల్పనా సాహిత్య రచయిత తన కథలలో సమకాలీన ప్రపంచాన్ని చిత్రించాలనుకుంటాడు. ఈ ప్రపంచం యెంత బాగున్నదీ, ఎంత బాగులేనిదీ, ఎట్లా వుంటే యింకా బాగుండేదీ విశదీకరించాలనుకుంటాడు. అయితే ఈ ప్రపంచం క్షణక్షణం మారిపోతూవుంది. మారడం, మారకపోవడం అలావుంచి రచయిత కృషి పరంగా చూస్తే, అతను రాస్తున్నది ఈ ప్రపంచాన్ని గురించి అతనికి వున్న అభిప్రాయాలేగాని, యదార్థంగా యీ ప్రపంచం వున్న తీరు కాదు.... అనేది మరో అభిప్రాయం బయటపడటానికి అవకాశం వుంది. ప్రపంచం - యిందులోని వస్తువులు... మనుషులు యెలావున్నారు అని తాను అనుకుంటున్నాడో ఆ అనుకున్న దానినే అతను వర్ణనాత్మకంగా చెప్పుకుంటూ పోతున్నాడు. సాహిత్య పరిశ్రమలో అనవరతమూ జరుగుతున్న పని యిదే.

జరుగుతున్న విషయాలను గురించి రాస్తూ వున్నప్పుడు వాటిపై మన అభిప్రాయం జోడింపు కాకుండా వుండదు. మన అంచనాలలో వాటికి వున్న అంతస్తు కనబడకుండా వుండడం జరుగదు. అంత మాత్రం చేత మనం జరుగుతున్న విషయం చెప్పడం లేదనీ, యింకేదో కల్పనమటుకే చేస్తున్నామనీ అనుకోగూడదు. జరుగుతున్న దానికి మరేదో 'మలాము' పూసి ఈ జోడింపును పదిలంగా ప్రజల ముందు ప్రదర్శిస్తున్నామన్న మాట.

కల్పనకు యదార్థతకు ఎంత సంబంధం వుంది? - అని ప్రశ్న వేసుకుని ఆ ప్రశ్నకు 'స్వప్రజ్ఞ' **(Self consciousness)**తో సమాధానం చెప్పుకునే ప్రక్రియకు 'మెటా ఫిక్షన్' **(Meta Fiction)** అని నామకరణం చేశారు కొందరు. ఈ మాటను మొట్టమొదట అమెరికన్ నవలాకారుడు, సాహిత్య విమర్శకుడు విలియం హెచ్. గాస్ **(William H. Gass)** అనే అతడు 1970లో ఉపయోగించాడు.

ఫిజిక్స్, మెటా ఫిజిక్స్ అనే మాటలు పదార్థ విజ్ఞాన శాస్త్రం - వేదాంత శాస్త్రాలకు ఇంగ్లీషు మాటలుగా వాడుకలో వున్న విషయం మనం ఎరుగుదుం. ఫిజిక్స్ ఎలా వేదాంత తత్త్వ దర్శనాలకు, గుప్త విద్య **(Occultism)**, గుహ్య విద్య **(Mysticism)** సూత్రాలకు దగ్గరగా వస్తున్నదో ఇటీవల ముప్పయి సంవత్సరాలుగా **Non - Fiction** రచనలు చూస్తూ వున్నవాళ్లకు బాగా విదితమే. పాశ్చాత్య భావుకులు, పరిశీలకులు ప్రాచ్య దేశాల భావుకతకు, నిగూఢ తత్త్వానికి దగ్గరగా వస్తున్నారు, దానిని సమూలంగా అందుకుందుకు ప్రయత్నం చేస్తున్నారు.

హైసెన్ బర్గ్ **(Heisenberg)** అనే శాస్త్రజ్ఞుడు 'అనిశ్చిత తత్త్వం' **(Principle of Uncertainty)** అనే ఒక సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. ఒక వస్తువును మనం చూస్తూవుంటే, మన ప్రతి చూపూ ఆ వస్తువులో ఎంతో కొంత మార్పు తీసుకు వస్తుంది. ఈ ఆలోచనను జాగ్రత్తగా పరికించి చూస్తే వస్తుమయం అయిన ప్రపంచాన్ని యధాతధంగా వర్ణించడం కల్పనా సాహిత్య రచయితకు యెంత మాత్రమూ సాధ్యం కాదు అనే విషయం బయట పడుతుంది. ఎందుచేతనంటే, చూస్తున్న వాడు ఈ ప్రపంచాన్ని అనుక్షణమూ మార్చి పారవేస్తున్నాడు గనుక. ఇదీ అతని సిద్ధాంతసారం.

'మెటాఫ్రిక్షన్' యింత కంటె యింకా లోతుకు పోతుంది. 'ప్రకృతి చిత్రణ చేయడం అసాధ్యం. ఆ

ప్రకృతితో నీకు వున్న సంబంధాన్ని మటుకే నీవు చిత్రిస్తున్నావు-' అనే స్థాయి నుంచి.... ఇది కూడా అంతతేలికయిన పని కాదు అని చాటి చెబుతుంది మెటా ఫిక్షన్.

హెమ్స్లర్ (L. Hjelmsler) అనే భాషావేత్త 1961లో మెటాలాంగ్వేజ్ (Meta Language) అనే మాటను ప్రయోగించాడు. భాష భావానికి అనుగుణంగా అనుశ్రుతంగా పెల్లుబికి ప్రవహించే తీరుకు యిది సంకేతం.

మెటా ఫిక్షన్, మెటాలాంగ్వేజ్ అనే మాటలు కొత్తవే కావచ్చును. కాని సాహిత్యంలో - ఆధునిక రచనలలో, ముఖ్యంగా వాటి ప్రయోగాలు, ఈ పదాలు ప్రచారంలోనికి రావటానికి బహు ముందు కాలం నుంచి వున్నాయి. మెటాఫిక్షన్ అనేది సాహిత్య ప్రక్రియలో అంతర్లీనం అయిపోక పోయినట్లయితే ఆ సాహిత్యానికి గుర్తింపు, మన్నన, కొనసాగింపు వుండేవి కాదు.

ప్రతి 'కళ' లోను రెండు భిన్న ధోరణులు కనిపిస్తాయి.

1. ఏదో చెప్పాలనే తాపత్రయం. ఆ చెబుతున్న మాధ్యమాన్నే సాధనంగా ఉపయోగించడం.
2. చెబుతున్న విషయాలను యేదో కళాత్మకం చేసి, ఆ మాధ్యమాన్ని అదే 'అంతం' అన్నట్లుగా తయారుచేయడం.

ఈ రెండు ధోరణులు విడదీయరానంతగా కలిసిపోవడం అవసరం.

కథలకు తీసుకున్న వస్తువు, అవలంబిస్తున్న శైలి, వర్ణనలకు ఉపయోగించే భాష, పాత్రల సంభాషణలు, పాత్రలను గురించి రచయిత చెప్పే అభిప్రాయాలు........ యిలాంటి అంగాలన్నీ ఒకదాని కొకటి విరుద్ధంకాకుండా, పాలలో నీళ్లలా కలిసిపోవాలి. అప్పుడు ఆ కథ - రచన - చెక్కు చెదరకుండా ఎన్నాళ్లకయినా నిలచి పోతుంది. (పాలు - నీళ్ళు ఉదాహరణంగా చెప్పాం గనుక విషయాన్ని Dilute చేస్తున్నాం - అనుకోకండి. తెలియరాకుండా కలిసిపోవడంలోని సహజ ధోరణికి మాత్రమే ఆ ప్రతీక.)

కల్పనా సాహిత్యానికి 'కాలబలం' వుంది. సమకాలీన సమాజాన్ని చిత్రించడమే ప్రధానంగ పెట్టుకున్న రచనలు గూడ - పై నియమాలను తెలిసో తెలియకో అవలంబించినందువల్ల - సర్వకాలీనత పొందడం జరుగుతుంది. కొన్ని కొన్ని వెనకటి కథలు చదువుతూ వున్నప్పుడు ఆ కథావస్తువు యిప్పుడు అసమంజసం అనీ, ఊహకు అందనిదేననీ అనిపించినా - రచనా సంవిధానం వల్ల వాటికి 'సర్వకాలీనత' వున్నట్లు స్పష్టం అయిపోతుంది.

వెనకటి రచనలు యినాటి చదువరులు మెచ్చరు.... అనే మామూలు మాటకు విపర్యయంగా ఎన్నో వందల, వేల కథలు యీనాటికీ చదివి ఆనందించటానికి తగినవి మన సాహిత్య భండారంలో వున్నాయి.

కల్పనా సాహిత్యం సమాజాన్ని మార్చివేస్తుంది. సమాజంలో వస్తున్న మార్పు సాహిత్య స్వరూపాన్ని మార్చి వేస్తోంది. ఈ రెండూ పరస్పర ఆశ్రయంగా నిరంతరం జరుగుతున్న ప్రక్రియలు. ఈ ప్రక్రియలకు వున్న మూలాన్ని - బీజాన్ని - పట్టుకోగలిగిన రచయిత మాటల కూర్పులతో మారుతున్న ప్రపంచానికి రూపకల్పన చేస్తూనే 'సర్వకాలీనత' కూడా సాధిస్తున్నాడు.

## దేశభక్తుడు, దానశీలి, విశ్వదాత, దేశోద్ధారక

# శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు

**- మువ్వల సుబ్బరామయ్య**

తెలుగు దేశం గురించి తెలియాలంటే ఆంధ్రపత్రిక చదావాలి అటువంటి ఆంధ్రపత్రిక నేడు లేకపోవడం ఆంధ్రుల దురదృష్టం. అటువంటి ఆంధ్రపత్రిక స్థాపకులు పంతులుగారి 133వ జయంతిని పురస్కరించుకొని ఈ వ్యాసం.

కాశీనాధుని నాగేశ్వర రావు పంతులుగారు 1867 మే 1న కృష్ణాజిల్లా, గుడివాడ తాలూకా, ఎలకుర్రు గ్రామంలో ఆచార సాంప్రదాయాలు గల బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. తండ్రి బుచ్చయ్య, తల్లి ఇవటూరి సోమనాధ శాస్త్రిగారి కుమార్తె శ్యామలాంబ. పంతులుగారి బారసాలనాటి పేరు నాగలింగం.

ఆ రోజుల్లో ఇంగ్లీషు నేర్చిన శ్రీ కందుకూరి వీరేశలింగంగారి సంఘసంస్కరణోద్యమం, బ్రాహ్మమత ప్రచారము, వివేక వర్ధని పత్రిక నాగేశ్వరరావుగారిని ఆకర్షించి, నూతన భావాలను పాదుకొల్పాయి. పూర్వాచార పరాయణులైన తండ్రిగారికి ఇంగ్లీషు చదువునచ్చదు. కాని ఈ విషయంలో తల్లిగారి అండతో ఇంగ్లీషులో విద్యాభ్యాసం చేయగలిగారు.

నాగేశ్వరరావుగారు బందరులో చదువుతున్నప్పుడు హిందూ థియేటరు ఆకర్షించింది. హరిశ్చంద్రలో చంద్రమతి పాత్ర, శ్రీకృష్ణ తులాభారంలో రుక్మిణి పాత్ర ధరించి జనాదరణ పొందారు. పంతులు గారి తండ్రిగారికి ఇంగ్లీషు చదువు, నాటకాలు బాగా మనస్తాపం కలిగించాయి. 1885లో జగ్గయ్యపేటకు నాటక ప్రదర్శనకు నాగేవ్వరరావుగారు వెళ్ళిన సమయంలో తండ్రిగారికి బాగా జబ్బుచేసింది. ఆ వార్త అందినా, ముందుగా కంపెనీ వారు ప్రచారం చేసి ఉన్నందున వెంటనే రాలేక పోయారు. అవసాన సమయానికి కొంచెం ముందుగా రాగలిగారు. అంత్యక్రియలు నిర్వర్తించారు.

నాగేశ్వరరావు పంతులుగారు ఉన్నత విద్యకు చెన్నపట్నం వెళ్ళారు. అక్కడ శ్రీ రెంటాల వెంకట సుబ్బారావుగారు హైకోర్టు న్యాయవాది. అనేక రచనలు చేసిన మేధావి. విక్టోరియా డిపో అనే పేరుతో మందుల వ్యాపరమే కాక ఇతర వ్యాపారాలు కూడా చేస్తున్న సంపన్నులు. వారు నియోగి బ్రాహ్మణులు, లింగధారణ లేనివారు. (ఆరోజుల్లో ఆరాధ్య కుటుంబంలో-ధారణ లేని వారిని భోజనాలలో మడికి పనికి రాని వారుగా దూరంగా ఉండేవారు) బుద్ధిమంతుడు, స్ఫురద్రూపి అయిన నాగేశ్వరరావుగారు - సుబ్బారావుగారి దృష్టిలో పడ్డారు. తమ మేనకోడలు రామాయమ్మని వివాహం చేసుకోమన్నారు. శ్రీ కొండా వెంకటప్పయ్య మొదలైన మిత్రుల సలహాతో వివాహానికి అంగీకరించారు నాగేశ్వరరావుగారు. మిత్రులే పెళ్ళి పెద్దలుగా 1890లో చెన్నపట్నంలో వివాహమైంది. ఆ వివాహానికి తల్లిగాని,

బంధుమిత్రులుగాని ఎవరూ రాలేదు. తల్లిగారికి కొడుకు కళ్ళముందు ఉండి ఏదో ఒక ఉద్యోగం చేస్తూ సంసారం గడుపుతూంటే చూడాలని ఆమె కోరిక. కాని నాగేశ్వరరావు గారు స్వతంత్ర జీవనంలో బాగా డబ్బు సంపాదించి లోక కళ్యాణానికి దానిని వినియోగించాలని వారి ఆశయము. అందుకు వ్యాపారమే సాధనమని నమ్మి 1892లో బొంబాయి వెళ్ళారు. తరువాత 1894లో కలకత్తాకు నివాసం మార్చారు. తిరిగి 1896లో మద్రాసు వచ్చి, మరల 1898లో రెండవసారి బొంబాయికి వెళ్ళారు. అక్కడ 1899లో అమృతాంజనం వ్యాపారం ప్రారంభించారు. అదే నెమ్మదిగా వృద్ధిచెంది ఆయన ఆశయాన్ని సాఫల్యం చేకూర్చింది. పంతులుగారు తల్లిని తనతో బొంబాయి తీసుకెళ్ళారు. కాని పూర్వాచార పరాయణురాలైన ఆమెకు ఆ పట్టణ జీవితం సరిపడక స్వగ్రామం చేరింది. ఆమెకు జబ్బుగా ఉందని తెలుసుకుని భార్యతోపాటు స్వగ్రామం వచ్చి ఆమెకు ఎన్నో వైద్యాలు చేయించారు పంతులుగారు. కాని 1902లో ఆమె పరమపదించారు. తల్లి అంత్యక్రియలు ఘనంగా చేసి, తల్లి ఋణం తీర్చుకున్నారు.

నెలకు ముప్ఫై రూపాయల జీతము మీద ఒక జమిందారు గారి వద్ద ట్యూటర్ ఉద్యోగం కుదిర్చి, స్వస్థలానికి రమ్మని వ్రాసిన బావగారి ఉత్తరానికి నాగేశ్వరరావుగారు వ్రాసిన జాబును శ్రీ గొర్రెపాటి వెంకట సుబ్బయ్యగారు వ్యవహారికం చేశారు.

ప్రియమైన బావగారికి!

పదిమంది చుట్టపక్కాల నడుమను ఉండడం మంచిదేగాని తొమ్మిది సంవత్సరాల నుంచి నా స్వభావానికి, ఆశయానికి తగిన కృషిలో బాధపడుతున్నాను. ఇంకా గమ్యస్థానం చేరుకోలేదు. భగవంతుడు ఏమి చేస్తాడో తెలియదు. కాని అంతవరకూ ఎన్ని కష్టాలైనా పడదలచుకున్నాను. నా ప్రయత్నంలో గెలుస్తానా, అదృష్టవంతుణ్ణే. ఓడిపోతానా, చావలేక బ్రతుకుతూ ఉన్న వేలకొలది దురదృష్టవంతులలో ఒకణ్ణవుతాను. నాకిష్టం లేకపోయినా తప్పని సరి బట్టి ఒక కార్యాలయంలో పని చేస్తున్నాను. ఎప్పుడవకాశం దొరికితే అప్పుడు దాన్ని తన్నేస్తాను. ఈ ఉద్యోగం నామనః ప్రవృత్తికి అనుకూలంగా లేకపోయినా పూర్వ స్నేహమూ, లావాదేవీలను బట్టి కొంతకాలం చెయ్యక తప్పడం లేదు.

ప్రస్తుతం నెల 1 కి రు. 100-0-0లు ఇస్తున్నారు. దేవుడు మేలు చేస్తే, వచ్చే సంవత్సరం మొదటి నుంచీ రు. 150-0-0లు ఇవ్వవచ్చును. నామకః నాకొక యజమాని ఉన్నాడన్న మాటే గాని నేను సంపూర్ణంగా స్వతంత్రుణ్ణే. అయినా నాకిదేమీ తృప్తికరంగా లేదు. దీనికి తోడు నా మందులు, పుస్తకాలు వల్ల నెల 1 కి మరో రు 50-0-0లు వస్తున్నవి. ఆ వ్యాపారాన్నే వృద్ధి చెయ్యాలని నేనెంతో అభిలాషపడుతున్నాను. కాని, డబ్బు లేనందువల్ల ఎప్పటికప్పుడు వాయిదా వేయవలసి వస్తున్నది.

మీరిప్పిస్తానన్న ట్యూటర్ షిప్పును రు. 30-0-0ల వేతనం మీద నేనంగీకరించలేను. నాకు పైకి

రావలెనని అంతులేని అపారమైన ఆశ, ఆకాంక్ష ఉన్నవి. ఏదో ఒకనాడు నాకోరిక ఫలించి తీరుతుందని నా నమ్మకం. ప్రస్తుత పరిస్థితుల్లో బొంబాయి కంటే మరో చోటు నాకనుకూలంగా ఉండదు. వారిచ్చే రు.30-0-0లతో శనివారపు పేటలోగాని, మరెక్కడగాని ఉన్నా నా సుఖస్వప్నాలన్నింటికీ నేను స్వస్తి చెప్పవలసిందే. నా జీవిత భీమాకేనేను నెల 1కి రు.23-0-0లు కట్టాలి. మిగిలిన ఏడు రూపాయలతో, మిగతా అప్పుసప్పులెలా ఉన్నా జీవితం ఎలా గడుస్తుంది? అందువల్ల నాకది ఇష్టం లేదు. పైగా వ్యక్తి సేవ యెప్పుడూ చాలాకష్టం. రాజా మంచి వాడు కావచ్చును. సంకుచిత బుద్ధులైన జనుల మధ్య అభివృద్ధి చెందడం ఇంతకంటే నాకు కష్టంగా వుంటుంది. అందువల్ల మీ సహాయాన్ని నేను కృతజ్ఞతా పూర్వకంగా తిరస్కరిస్తున్నాను.

మీ విశ్వాసి
కె. నాగేశ్వరరావు

నాగేశ్వరరావు గారు బొంబాయిలో 1908లో కీలక సంవత్సరం భాద్రపద శుద్ధ చతుర్దశి బుధవారం నాడు 'ఆంధ్రపత్రిక' వార పత్రికను ప్రారంభించారు. తెలుగు పత్రికారచయితలకు కులపతి శ్రీ నాగేశ్వరరావు పంతులుగారు. తెలుగు పత్రికారంగం ముఖ్యంగా తెలుగు దినపత్రికలు అభివృద్ధి చెందడమంటే అది ఆయన చలవే. 1914లో మొదటి తెలుగు దినపత్రికను స్థాపించినపుడు ఆయన దగ్గర సాధన సంపత్తి చాలా తక్కువ. ఆంధ్రపత్రిక కేవలం వార్తా పత్రిక కాదు, జాతీయ సంస్థ. ఆంధ్ర జాతికి గౌరవం తెచ్చిన ఉత్తమ పత్రిక. వార పత్రిక ప్రథమ సంపాదకీయంలో నాగేశ్వరరావు గారు ''ప్రజలకు విద్యాభివృద్ధియు, ప్రపంచ జ్ఞానాభివృద్ధియు గావించుటయే మా ముఖ్యాభిప్రాయము'' అన్నారు. ఆరేండ్ల తరువాత దినపత్రిక ప్రారంభిస్తూ ''నిందాస్తోత్రములను బాటింపక శక్తికొలది యుద్దేశ నిర్వహణమునకై నిర్వాహకులు పాటుపడిరి. ముందును ఇట్టి యాదర్శములను బోధించుటయే పత్రికోద్దేశము. శాఖా భేదములు, కులభేదములు, మత భేదములు, జాతి భేదములను గమనింపక మిత్ర భావమును వ్యాపింప జేయుటకే ప్రయత్నించెదము. దైవానుగ్రహము సకలాభీష్టసిద్ధికి సాధనము'' అని ఉద్ఘోషించారు.

ఆంధ్ర పత్రికకు మొదట శ్రీ అవటపల్లి నారాయణరావు గారు తర్వాత శ్రీ హరి సర్వోత్తమ రావుగారు సహాయ సంపాదకత్వము వహించారు. తర్వాత చాలాకాలం శ్రీ చల్లా శేషగిరి రావుగారు ఆ స్థానంలో ఉన్నారు. శ్రీ శేషగిరిరావు గారి మూర్తి కూడా శ్రీ నాగేశ్వరరావుగారి మూర్తిలా ధీరోదాత్తమూగా ఉండేది. వారి ఆధ్వర్యములో ఆంధ్రపత్రిక పరిణయ యౌవనమను కూర్చుకున్నది. అంతకుముందు ఆంధ్రపత్రికలో ఇంగ్లీషులోనే టెలిగ్రాములు ఇత్యాదులు ప్రచురించేవారు. శ్రీ శేషగిరిరావు గారు చేసిన సూచనను హర్షించి నాగేశ్వరరావు గారు ఆ పద్ధతిని ఆపుచేశారు. ''తెలుగు దేశములో పరిస్థితులు తెలుసుకోవలెనంటే ఇంగ్లీషు వారు ఆంధ్రపత్రికను చదువవలసి వస్తుంది'' అని నాగేశ్వరరావుగారు సగర్వంగా అన్నారు.

మహాత్మాగాంధీజీ 1929మే 30న యంగ్ ఇండియాలో ''ఒక కొత్త అంజనం కల్పించి దానికి ఆకర్షకమయిన పేరుపెట్టి ధనం ఆర్జిస్తున్నారు అని నేను ఎల్లప్పుడూ దేశోద్ధారకుని పరిహసిస్తూనే వుంటాను.'' ''అది నిజమే. అది అనుచితమే గాని నేనేమి చేయగలను? అది నిరపాయకరమైన అంజనము. దాని వలన వచ్చే ధనాన్ని దేశసేవ కోసం వ్యయపరచడానికే నేను ప్రయత్నిస్తున్నాను'' అని అతడు ఎల్లప్పుడూ చిరునవ్వు నవ్వుతూ నాకు సమాధానం చెబుతుంటారు. స్వకల్పితమైన ఆ అంజనము గూర్చి నేనెంతటి ఉపేక్షతో పరిహాసం చేస్తుంటానో, అంతటి ఉపేక్షతోనే దానిని గూర్చి దేశోద్ధారకులు ఇచ్చిన సమాధానాన్ని కూడా నేను గ్రహించేవాడిని. ఆ కారణం వల్ల దేశోద్ధారకులు తన అమృతాంజనం డిపోవలన బహుజనులకు ఉపకారం చేస్తున్నాడనే విషయంలో నాకు అదివరకు ఎట్టి నమ్మకమూ కలుగలేదు. కాని ఆయన ఆంధ్రదేశములో ప్రజాహిత కారాలయిన పెక్కు ఉద్యమాలకు అపరిమితంగా ధనసహాయం చేస్తున్నారని యీసారి ఆంధ్రదేశ సంచారంలో నేను గ్రహింపగలిగినపుడు నాకు మిక్కుటమయిన ఆశ్చర్యమే కలిగింది'' అని వ్రాశారు.

నాగేశ్వరరావు పంతులుగారు చేసిన ధర్మకార్యాలు అందరికీ తెలిసినవేనా? ఆయన కుడిచేతితో ఏమి ఇచ్చారో ఎడమ చేతికి తెలియదు. చాలా మందికి గుప్తదానాలు చేశారు. పంతులుగారి వంశంలో మూలపురుషులు శ్రీపతి పండితులు బెజవాడ (విజయవాడ) వాస్తవ్యులగుట వలన పంతులుగారు బెజవాడ మీద అభిమానముతో దుర్గాభవనము, దుర్గా కళా మందిరము, ఆంధ్రపత్రికకు ప్రత్యేక కేంద్రం స్థాపించారు.

కాంగ్రెసు ఉద్యమము, హరిజనోద్యమము రెండూ పంతులుగారికి చాలా ప్రియమైనవి. రెండు ఉద్యమాలకి మిక్కిలి ఉదార భావముతో సాయం చేశారు. చాలా కాలం ఆంధ్ర హరిజన సేవకి సంఘాధ్యక్షులుగా ఉన్నారు. హరిజనులకు ఎన్నో నివాస స్థలాలు దానం చేశారు. ఆయన సంపాదించినదంతా దరిద్ర నారాయణులకే అర్పణ చేశారు. అత్యంత దేశభక్తులు. 63వ యేట జైలుకు వెళ్ళారు. తర్వాత మళ్ళీ రెండు సార్లు వెళ్ళారు. దేశోద్ధారకులు నాగేశ్వరరావు పంతులుగారు 1938 ఏప్రియల్11న దివంగతులయ్యారు. నాగేశ్వరరావు గారు పరమపదించే నాటికి ఆంధ్రపత్రిక ఎనిమిది వందల మందికి ఉచితంగా పంపుతూ ఉండేవారు. దానివల్లనే పత్రికకు నష్టమని శ్రీ పట్టాభిగారు లెక్కకట్టారు.

ఆంధ్రుల సేవ, ఆంధ్రభాషాసేవ - ఇవే ఆయనకు పరమధ్యేయాలు. లోకమాన్య తిలక్ 'కేసరి' ని ఏవిధంగా పెంచారో, అదే విధంగా శ్రీ నాగేశ్వరరావు గారు ఆంధ్రపత్రికను పెంచారు. ఆంధ్రపత్రిక ప్రజలలో విజ్ఞానాన్ని అభివృద్ధి చేసింది.

ఆంధ్రపత్రిక, భారతి మాసపత్రిక, ఆంధ్రగ్రంథమాల, విజ్ఞాన సర్వస్వము రెండు సంపుటాలు పునర్ముద్రణలు, సంవత్సరాది సంచికలు నాగేశ్వరరావు గారి సాహిత్య విజ్ఞాన దీక్షకు ప్రత్యక్షచిహ్నాలు.

# దివ్య శక్తులు వుంటే 5 కోట్ల రూపాయలు సంపాదించవచ్చు!

**- ఎన్. ఇన్నయ్య**

దివ్య శక్తులు, ఇంద్రియాతీత (అతీంద్రియ) మహిమలు ప్రాచీన కాలంనుండి నేటి వరకూ చర్చనీయాంశమే. నమ్మకస్తులు, భక్తులు, ఆస్తికులు యీ శక్తుల్ని ఏదో మేరకు ఒప్పుకుంటారు. వారి బలహీనతను ఆధారంగా పురోహిత వర్గాలు, బాబాలు, మాతలు వివిధ ప్రక్రియలతో ఆకర్షించి ఆర్జిస్తున్నారు. ఇంచుమించు వ్యాపార సరళిలో నమ్మకాలను నడిపిస్తున్న మతాలు అన్ని రంగాలలో ప్రవేశించి ప్రభావితం చేస్తున్నాయి.

ప్రశ్నించేవారు, సందేహించేవారు, శాస్త్రీయ పద్ధతిలో సాగిపోయేవారు ఇంద్రియాతీత శక్తుల్ని, మూఢ నమ్మకాలను, అద్భుతాలను బట్టబయలు చేస్తున్నారు. అయినా కొత్తవి పుట్టుకొస్తున్నాయి. ఇటీవల సైన్స్‌ను, కంప్యూటర్లను, సాంకేతిక జ్ఞానాన్ని మూఢనమ్మకాల వ్యాప్తికి వాడడం విశేషంగా కనిపిస్తున్నది. అది మరీ జనాకర్షణకు దారితీస్తున్నది. జ్యోతిష్యం, హోమియో వైద్యం కంప్యూటరైజ్ చేసి దుర్వినియోగం చేయడం ఎక్కువైంది.

మహిమలు, దివ్యశక్తులు ప్రశ్నార్థకంగా చేసిన వ్యక్తులలో జేమ్స్ రాండిని ప్రముఖంగా పేర్కొనవచ్చు. ఆయన 10వేల డాలర్లు బ్యాంకులో పెట్టి ఇంద్రియాతీత శక్తుల్ని ప్రపంచంలో ఎవరు ఎక్కడ రుజువు చేసి అయినా, ఆ డబ్బు స్వీకరించమన్నాడు. 20 ఏళ్ళనుండి ఆ పందాన్ని ఎవరూ గెలవలేదు. నిరంతరం జేమ్స్ రాండి ప్రపంచ పర్యటనచేసి, అద్భుతశక్తుల్ని, మహిమల్ని, భక్తి కూటముల రోగ చికిత్సను, హోమియో మోసాన్ని, జ్యోతిష్యాన్ని ఎండగడుతూనే వున్నాడు.

జేమ్స్ రాండి 10పుస్తకాలు రాశాడు. అందులో సారాంశమంతా దివ్యశక్తులు, పేరా సైకాలజీ మహిమల గురించి గుట్టు రట్టు చేయడమే.

ఇటీవల జేమ్స్ రాండి ఒక విజ్ఞాన సర్వస్వం వెలువరించాడు. అకారాది వరుసలో అన్నిచోట్ల ప్రచారంలో వున్న శక్తుల గురించి సంక్షిప్తంగా, హాస్య భరితంగా వెలువరించాడు. దీనికి ఆర్థర్ సి. క్లార్క్ (శ్రీలంక శాస్త్రజ్ఞుడు) ముందు మాట రాశాడు.

టి.వి. ప్రసారాలలో జేమ్స్ రాండి శక్తుల - మహిమల బండారాలను బయటపెట్టాడు. చైనానుండి ఆస్ట్రేలియా వరకూ పర్యటించి ఉపన్యాసాలిచ్చాడు. ఫిలిప్పిన్స్‌లో విపరీత మోసాలకు గురైన సైకిక్ సర్జరీ నిశితంగా పరిశీలించాడు. హోమియో దగాలను ఫ్రాన్స్, కెనడా, ఇజ్రాయల్, ఇంగ్లండు, అమెరికాలలో ఛాలెంజ్ చేసి, అసలు విషయాలు చెప్పాడు. అమెరికాలో భక్తి కూటాల దొంగ

బాబాలను నిలబెట్టి వారి మోసాలను చెప్పడంతో కొందరు రంగ నిష్క్రమణ చేశారు. మరి కొందరు దివాలా తీశారు.

యూరిగెల్లర్ తనను దివ్యశక్తుల మాంత్రికుడుగా ప్రచారం చేసి డబ్బు ఆర్జించగా జేమ్స్ రాండి అతడ్ని ఢీకొన్నాడు. చంచాలు చూపుతో వంచడం, ఇంకా అనేక శక్తుల వెనుక ఎలా దగా చేస్తున్నాడో చెప్పాడు. చివరకు కోర్టు తగాదాలలో యూరిగెల్లర్ ఓడిపోయి అమెరికా నుండి పారిపోయి ఇంగ్లండ్‌లో స్థిరపడ్డాడు. క్రైస్తవ మత ప్రచారకులు ఎప్పటికప్పుడు జేమ్స్ రాండి దెబ్బలకు హతమౌతూనే వున్నారు.

జేమ్స్ రాండి రాసిన **Faith Healers** పుస్తకానికి కార్ల్ శాగన్ శాస్త్రజ్ఞుడు పీఠిక రాశాడు.

మకార్థర్ అవార్డు అందుకున్న జేమ్స్ రాండి కెనడా వాసి అయినా అమెరికాలోని ఫ్లారిడా రాష్ట్రంలో పరిశోధనా కేంద్రాన్ని నెలకొల్పాడు. అవివాహితుడు. ఆయన పరిశోధనలు ఇప్పుడు కంప్యూటర్ ద్వారా **website**లో చూడవచ్చు.

ప్రపంచ ప్రళయం వస్తుందని పవిత్ర గ్రంథాలలో అన్ని మతాలు పేర్కొని జనాన్ని ఎప్పటికప్పుడు హడలుగొడుతూనే వున్నాయి. అలాంటి వాటిలో ప్రముఖమైన 49 ప్రళయ జోస్యాల్ని జేమ్స్ రాండి ప్రచురించాడు. అన్ని తేదీలతో సహా వున్నాయి. ఎప్పటికప్పుడు మతాలు కొత్త తేదీలు యిస్తూ జనాన్ని భయం గుప్పిట్లో, తమ సేవలో అట్టిపెడుతున్నాయి. 2000 సంవత్సరం కూడా అంతానికి తేదీగా నిర్ణయించి, ఏమీ జరగకపోయేసరికి, కొత్త ఎత్తుగడలు వేస్తున్నారు.

ఆసక్తికరమైన ఎన్‌సైక్లోపేడియాలో జేమ్స్ రాండి చూపిన వివరాలు, ఒక్కొక్క అంశం పై యిచ్చిన సరళమైన, చతురోక్తులతో కూడిన వివరణ గమనార్హం.

**(An Encyclopedia of claims frauds and Hoaxes of the occult and supernatural, by James Randi, St. Martins press, 175 Fifth avenue, New York 10010 USA, 284** పేజీలు **Arthur C. Clarke** పీఠిక)

ఇందులో హోమియో గురించి జేమ్స్ రాండి ఏ మన్నాడో చూడండి. హానిమన్ రోగాలన్నీ మూడంశాలనుండే వస్తాయన్నాడు. సిఫిలస్, దురద పేర్కొనదగినవి. ఏ లక్షణాలున్న రోగం అదే లక్షణాలతో నయమౌతుంది. హోమియోలో వాడే ఔషదంలో మందు వుండదు. ప్రకంపనాలతో శక్తి పెరిగి, మందులో దాగివుంటుంది. వాస్తవానికి కేవలం నీరు మాత్రమే వుంటుంది. నీటిని అయస్కాంతీ కరణ చేయవచ్చునని ప్రస్తుతం కొందరు రాగితీగెల్ని వాడుతున్నారు. మూలకారణాల జోలికి పోక, రోగ లక్షణాలనే హోమియో పట్టించుకోడానికి వారికి మూలం తెలియకపోవడమే.

హోమియో ఒకరకంగా మాజిక్ అంశంగా మారింది. అందుకే యీ పుస్తకంలో దానిని చేర్చినట్లు జేమ్స్ రాండి పేర్కొన్నాడు.

ఎన్‌సైక్లోపేడియాలో అబారిస్ (పైథాగొరిస్‌కు గురువు) తో ఆరంభించి జోంబి (zombie) తో ముగించాడు. ప్రతి మాటను సంక్షిప్తంగా అర్థమయ్యేట్లు చెప్పడం జేమ్స్ రాండి కళ.

మహర్షి మహేష్ యోగి గురించి యిందులో క్లుప్తంగా చెప్పినా, అతడి మోసాలను మరో గ్రంథంలో చాలా వివరంగా బట్టబయలు చేశాడు.

(Flim - Flam లో The Giggling Guru : A matter of Levity చూడండి. Prometheus Books, 700 East Amherst Street Buffalso, Ny 14215 USA PP 342 దీనికి ఐజక్ అసియోవ్ పీఠిక రాశాడు).

భారత దేశంలో మహిమల గుట్టును శాస్త్రీయంగా వెల్లడిస్తున్న, బి. ప్రేమానంద్ గురించి యీ పుస్తకంలో వుండడం విశేషం. అంతర్జాతీయ గుర్తింపు పొందిన ప్రేమానంద్ తమిళనాడులోని పోడునూరు, కోయంబత్తూరు నుండి ఇండియన్ స్కెప్టిక్ అనే ఇంగ్లీషు మాసపత్రిక నడుపుతున్నాడు.

జ్యోతిష్యం భవిష్యత్తును చెబుతున్నా, కంబోడియా జ్యోతిష్యం రానున్న ఉపద్రవాన్ని అరికడతానని కూడా అంటుందని రాశాడు.

భారతీయులకు సంబంధించి జిడ్డుకృష్ణమూర్తి దివ్యజ్ఞాన సమాజ పరిస్థితి ఉదహరించాడు.

కుండలినియోగం, చక్రం, ఫకీర్, గురువు, హరేకృష్ణ, కర్మ, మండలాలు, మంత్రం, ఓం, సాయిబాబా, సిద్ధి, తంత్ర, యోగం, ప్రస్తావనలు వున్నాయి.

భారతీయులకు తెలియని విదేశీ విషయాలు చాలా వున్నాయి. కొన్ని మాత్రం మన దేశంలో వున్నట్లే ఇతర దేశాలలో మార్పులు చేర్పులతో వున్నాయి. అందుకు ఉదాహరణగా దానంతట అదే, చేయి రాస్తూ పోతుందనడం, హస్త సాముద్రికం (కొందరు అరికాలిలో గీతలు కూడా ప్రభావితం చేస్తాయని నమ్ముతారు). జ్యోతిష్యం, నిప్పులపై నడక, గాలిలో తేలడం, దూరశ్రవణ, దూరదృష్టి, ముఖ కవళికల్ని బట్టి వ్యక్తి ఎలాంటి వాడో చెప్పగలగడం, దృష్టి దోషం, చేతబడి, దివ్యశక్తితో, నీళ్ళు, ఆయిల్ ఎక్కడపడేది చెప్పడం వున్నాయి.

**ప్రపంచం అంతం**

జేమ్స్ రాండి పేర్కొన్న 49 ప్రపంచ అంతం జోస్యాలు చాలా ఆసక్తి కరమైనవి. బైబిల్ ఉదాహరణలు, క్రైస్తవ జ్యోతిష్యుల అంచనాలు యిచ్చి అవి ఎలా వెర్రి వాళ్ళను చేసాయో చూపాడు.

క్రీ.శ. 992లో మొదలుపెట్టి 1999 జులై వరకూ చెప్పిన ప్రళయ జోస్యాలు రాండి పేర్కొని, విఫలం అయిన తరువాత కూడా జ్యోతిష్యులు తలెత్తుక తిరుగుతున్నారన్నాడు. జోస్యాలు చెప్పిన వారిలో బిషప్పులు కూడా వున్నారు.

(శ్రీశ్రీ మాటలు గుర్తు తెచ్చుకోండి - హిప్పొపొటమస్ ఒక బిషప్పును గనియిట్లనియో స్వామీ తమరు చెప్పిందే చెప్పిందే మరల మరల చెప్పుటెందులకని)

16వ శతాబ్దంలో ఫ్రెంచి వ్యక్తి నోస్ట్రాడామస్ (1503-1566) శతాబ్దాలు అనే గ్రంథం (Centuries) రాశాడు. ఇది 10 భాగాలు. ఇందులో అన్ని భవిష్యత్తువాణి ఉన్నాడు ఇప్పటికి వాటిని నమ్మేవారున్నారు. అతడు ఒకటవ ఎలిజబెత్ రాణి గురించి చెప్పింది ఒక్కటీ నిజం కాలేదు. అతడి 10వ భాగంలో చెప్పిన ప్రకారం 1999 జూలైలో ప్రపంచం అంతం కావాలి. జేమ్స్ రాండి దీనిపై వ్యాఖ్యానిస్తూ అంతా అబద్ధాలమయయంగా వున్నాయా 10 భాగాల రచనల్ని భక్తులు విపరీతార్థాలతో జనాన్ని భయపెట్టారన్నాడు.

తోకచుక్కల విషయం శాస్త్రీయంగా బొత్తిగా తెలియక దాని చుట్టూ అనేక ప్రళయ కథలు అల్లారన్నాడు.

సంఖ్యాశాస్త్రంలో, నేడు కంప్యూటర్లు వాడి తప్పుడు భాష్యాలు చెప్పడాన్ని చూపాడు. అలాగే పిరమిడ్లను అడ్డం పెట్టుకొని కొందరు కథలు అల్లడాన్ని చూపాడు రాండి.

ఆద్యంతాలు ఆసక్తికరంగా రాసిన యీ ఎన్‌సైక్లోపీడియా లైబ్రరీలలో వుండాలి. పిల్లలు చదవాలి. తల్లిదండ్రులు చదివి పిల్లల భయాలను పోగొట్టాలి. అసిమోవ్ చెప్పినట్లు పిల్లలందరూ సందేహవాదులే. వారు ప్రతిదీ ప్రశ్నిస్తాను. కాని ఆ ప్రశ్నా స్వభావాన్ని తల్లిదండ్రులు మతాలు చంపేస్తున్నాయి.

**5 కోట్లు గెలవండి**

జేమ్స్ రాండి 70వ పడిలో మూఢ నమ్మకాలపై నిరంతర పోరాటం సాగిస్తూ, బ్యాంకులో 10 లక్షల డాలర్లు పెట్టాడు (రూపాయలలో కావాలంటే 43తో హెచ్చించండి)

ప్రపంచంలో ఎక్కడైనా ఎవ్వరైనా సరే సైకిక్, అతీంద్రియ (ఇంద్రియాతీత) శక్తులున్నాయని రుజువు పరచి, ఆ డబ్బు స్వీకరించవచ్చు.

జేమ్స్ రాండి అడ్రసు:

**201 East. Davie Boulevard (S.E. 12th St),**
**Fort Lauderdale,**
**Florida 33316-1815**

ఈ నిర్ణయంలో జడ్జిగా జేమ్స్ రాండి వుండడు.

ముందుగానే చెక్కును నిష్పక్షపాతి వద్ద అట్టి పెడతాడు.

ఏ శక్తి వున్నదీ ముందుగా తెలియపరచాలి.

నిర్ణయించిన తేదీ, స్థలం ప్రకారం, పేర్కొన్న శక్తి ప్రదర్శన జరగాలి. ప్రదర్శన అంతా ఫొటో తీయడం, రికార్డు చేయడం జరుగుతుంది.

శక్తి ప్రదర్శన వేరే దేశాలలో జరగవలసివస్తే, జేమ్స్ రాండి ఒక నిష్పాక్షిక ప్రతినిధిని పేర్కొంటాడు. వారి ఎదుట ప్రదర్శన జరపాలి. ఇందులో దారిఖర్చుల చెల్లింపు వుండదు. ప్రదర్శన వలన జరిగే నష్టాలకు రాండి బాధ్యుడు కాదు కనుక నష్టపరిహార చెల్లింపు వుండదు.

జేమ్స్ రాండి తన తదనంతరం ఛాలెంజ్ ధనాన్ని అతీంద్రియ శక్తుల శాస్త్రీయ పరిశోధనా సంస్థకు యివ్వాలని రాశారు. ఇది అమెరికా లోని నయాగరా వద్ద బఫెలో నగర శివార్లలో వుంది **(Commttee for the Scientific Investigation of claims of the paranormal)**

ప్రదర్శనలో పేర్కొన్న ప్రకారం అతీంద్రియ శక్తి చూపలేక పోతే, తనకు అలాంటి శక్తి లేదని ప్రదర్శకుడు స్పష్టంగా ప్రకటించాలి.

**web address :**

**http://www.randi.org**

**Phone : 954-467-1112**

**Fax : 954 467 1660**

**ప్రార్థనలతో రోగాలు మటుమాయం**

భక్తి కూటాలు ఏర్పరచి, భజనలతో, ప్రార్థనలతో, బోధనలతో రోగాలు నయం చేస్తామని, వికలాంగులను బాగుచేస్తామని ప్రపంచ వ్యాప్తంగా మోసాలు చేస్తున్నారు. దీనిని చాలెంజ్ చేసి అదంతా బూటకమని జేమ్స్ రాండి రుజువు చేశాడు. అయినా వెర్రి భక్తితో జనం కొత్త బాబాల చుట్టూ ఆశా డబ్బు వదిలించుకుంటూనే వున్నారు.

తన అనుభవాలను జేమ్స్ రాండి ఒక పుస్తకంలో రాశాడు. అది బాగా ప్రచారంలోకి వచ్చిన గ్రంథం.

**The Faith Healers (Promethens Book, 3/4 pages, 700 East Amherst Street, Buffalo New york 14215 USA)**

అమెరికాలో క్రైస్తవ ప్రచారకులు చేసిన విపరీత మోసాలు బయటపెట్టిన పుస్తకం యిది. అమెరికా అధ్యక్షపదవిని ఆశించిన క్రైస్తవ ప్రచారకుడు పాట్ రాబర్ట్సన్ మొదలు, ఎ. ఎ. ఎలెన్, ఓరల్ రాబర్ట్స్, డబ్లు. వి. గ్రాంట్ ప్రభృతులను ఎండగట్టిన గ్రంథం యిది. టెలివిజన్ ప్రచారంలో భక్తి పేరిట చాలాడబ్బు వసూలు చేసిన సంఘటనలున్నాయి. రష్యాలో కమ్యూనిజం అరికట్టమని దేవుడు ఆదేశించాడు గనుక అర్జెంటుగా డబ్బివ్వమని టెలివిజన్ ద్వారా విజ్ఞప్తి చేసి, కాజేసిన వారి సంగతి బయట పెట్టాడు.

కుంటి, గుడ్డి వాళ్ళను స్వస్థత కూటాలలో బాగుచేస్తున్నట్లు చేసిన మోసాలను వెల్లడించాడు. కొందరు దివాలాతీసి పారిపోయారు. కొత్త బాబాలు తలెత్తుతున్నారు. నిరంతరం జేమ్స్ రాండి పోరాటం సాగిస్తూనే వున్నాడు. మనం తీసుకెళ్ళిన కుంటి, గుడ్డి, మూగవాళ్ళను అక్కడ నయంచేయరు. వారు ముందే ఏర్పాటుచేసి, నటించేవారిని తెచ్చి నయమయినట్లు చూపి, డబ్బు కాజేస్తుంటారు.

జేమ్స్ రాండి తన **Flim-Flam** అనే గ్రంథంలో మరికొన్ని రంగాలలో మోసాలను బయటపెట్టి వివరాలందించాడు. ఆకాశం నుండి వెగిరే పళ్ళాలలో వచ్చి కొందరు రోగాలను నయం చేస్తున్నారనే వదంతి ఎలా పనిచేస్తుందో చూపాడు. గాలిలో తేలిపోడానికి యోగ విద్య పని చేస్తుందనే మహేష్ యోగి మోసాలను బయటపెట్టాడు. ప్రత్యామ్నాయ ఔషధాల పేరిట చికిత్సలు చేసి మోసాలు కప్పిపుచ్చుకుంటున్నవారి గుట్టు రట్టు చేశాడు. దయ్యాలు, భూతాలు, పిశాచాలు, దేవతల పేరిట అద్భుతాల వ్యాపార రహస్యం వెల్లడించాడు. జ్యోతిష్యాన్ని ఎండగట్టాడు. హోమియోను ఉతికేశాడు.

జేమ్స్ రాండి స్వయంగా మజీషియన్. ప్రదర్శనలు యిస్తాడు. అయితే ఇతరులకూ యితనికీ తేడా వుంది. ప్రదర్శనలు కేవలం డబ్బుకోసం. ప్రేక్షకులకు వినోదం అందించడం. కాని మాజిక్ పేరిట మోసాలు చేయడాన్ని రాండి సహించడు.

సైంటిస్టులు అతి సులభంగా మాజిక్ వలలో పడతారని రాండి రాశాడు. సైన్స్ సూత్రాలను అతిక్రమించినట్లు మాజిక్‌లో కనిపించే వాటిని సైంటిస్టులు గుడ్డిగా నమ్ముతారని అదేవారి లోపం అనీ అన్నాడు. అందుకే కొందరు సైంటిస్టులు బాబాల భక్తులై పోయి, మూఢ నమ్మకాల వ్యాప్తికి తోడ్పడుతున్నారన్నాడు.

మాజిక్ తెలిస్తే మోసాలను గ్రహించడం తేలిక. మూఢంగా నమ్మడం వుండదు. చదువుకున్న వారు సైతం మాజిక్ మోసాలు తెలియక బాబాల వలలో తేలికగా పడుతున్నారన్నాడు.

మాజిక్ ఎలాచేస్తారు, అందులో రహస్యం ఏమిటి, ప్రపంచంలో మాజిక్ ఎలా వ్యాప్తిలో వున్నదీ జేమ్స్ రాండి వివిధ రచనలలో విపులీకరించాడు. **Conjuring** అనే రచన ముఖ్యంగా చదవదగింది. కొందరు మజీషియన్లు తమ విద్యను స్టేజికి పరిమితం చేయక, బాబాలుగా మారడాన్ని రాండి ఆగ్రహించాడు. యూరిగెల్లర్ మోసాలను అలాగే బయటపెట్టాడు.

పేరా సైకాలజీ ఒక అంటువ్యాధిలా అమెరికా, యూరోప్‌లో ఇతరచోట్ల వ్యాపించింది. కొందరు డిగ్రీలు కూడా పుచ్చుకుంటున్నారు. జె.బి.రైన్ మొదలు నేటివరకు పేరా సైకాలజి పేరిట జరుగుతున్న మోసాలను జేమ్స్‌రాండి ఎదుర్కొన్నాడు.

# కాలానికి కమ్మని వ్యాఖ్య

## (A BRIEF HISTORY OF TIME)

- కస్తూరి

'ఎందాక బుద్ధి నెగసెడు
నందాక చరింపవలయునాత్మజ్ఞులకున్'
( బమ్మెర పోతనామాత్యుడు, బాగవతం)

బల్ల మీదున్న కప్పు జారిపడింది. బద్దలైంది. ముక్కలన్నీ నేలమీద చెల్లా చెదురుగా పడ్డాయి. ఈ ప్రక్రియను కమేరాలో బంధించవచ్చు. ఫిల్ము రివైండ్ చేస్తే ముక్కలన్నీ తిరిగి కప్పుగా మారి బల్లమీదకు రావచ్చు. కాని ముక్కలైన కప్పు నిజజీవితంలో తిరిగి అతుక్కుని వెనక్కు ఎందుకురాదు? కాలం ముందుకే ఎందుకు పోతుంది? మనం నిన్నటి విషయాలను జ్ఞాపకం ఉంచుకోగలం. రేపటి సంగతులు ఎందుకు జ్ఞాపకం ఉంచుకోలేం? ఈ గ్రహాలనూ, నక్షత్రాలనూ, గాలెక్సీలనూ, ఎవ్వరైనా సృష్టించారా? లేక వాటంతటఅవి ఏర్పడ్డాయా! దేవుడే వీటన్నిటినీ సృష్టిస్తే ఆయన్ను ఎవరు సృష్టించారు? ఈ విశ్వాంతరాళం అనాదిగా ఉందా? మధ్యలో వచ్చిందా? మధ్యలో అంటే దేనికి మధ్యలో? కాలానికీ దూరానికీ అంచులున్నాయా? విశ్వాంతరాళంలో పెంజీకట్లకీ, చిక్కని వెలుగులకూ ఆవల ఏముంది? ఫలితం ముందూ కారణం తరవాతా ఎందుకు జరుగడం లేదు? ఆదికారణం (First lause) ఏమిటి? విశ్వం ఆవిర్భవించడానికి కారణం ఏమిటి? లేకుంటే అది ఏదైనా కారణానికి ఫలితమా? చెట్టు ముందా విత్తుముందా? ఇలాంటి చచ్చు ప్రశ్నలు పిల్లవాళ్లు వేస్తే కసురుకుంటాం. పెద్దవాళ్లు వేస్తే స్క్రూలూజు అనుకుంటాం. కాని మనిషి ఆలోచించడం మొదలైన నాటి నుండి, ఆర్యుల నుండి, అరిస్టాటిలు నుండి నేటి దాకా ఇలాంటి ప్రశ్నలు వేసుకునే మనుషులున్నారు. అలా వేసుకున్నందువల్లే మానవుడు ఈనాడు అంతరిక్షంలో ఎగరగలుగుతున్నాడు. వేదాంతులు 'ఎందుకు' అని ప్రశ్నిస్తే విజ్ఞానశాస్త్రజ్ఞులు 'ఎలాగ' అని ప్రశ్నించారు. 20వ శతాబ్దిలో ఈ రెండూ భౌతిక విజ్ఞాన శాస్త్రం కలిసిపోయాయి. గణితము, విజ్ఞానశాస్త్రం ఎంతో అభివృద్ధి చెంది వేదాంతాన్ని దాదాపు ఆవలకునెట్టివేశాయి. ''ఇవాళ వేదాంతులు భాషను విశ్లేషించడం మినహా మరేమీ చేసేది లేదు'' అన్నాడు విట్జెన్‌స్టీన్ అనే ప్రముఖ తత్వవేత్త.

ప్రముఖ శాస్త్రజ్ఞుడు ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ 1905లో ప్రత్యేక సాపేక్ష సిద్ధాంతాన్ని (Special Theory of Relativety) ప్రతి పాదించాడు. 1920లలో సాధారణ సాపేక్ష సిద్ధాంతం (General Theory of Relativity) గురించి నిపుణుడు శాస్త్రవేత్త సర్ ఆర్థర్ ఎడ్డింగ్టన్‌తో ఒక పాత్రికేయుడు ఇలా అన్నాడట. ''ప్రపంచంలో ఐన్‌స్టీన్ సాధారణ సాపేక్ష సిద్ధాంతం అర్థం చేసుకున్న వాళ్లు ముగ్గురే ఉన్నారట కాదా'' ఎడ్డింగ్టన్ జవాబుగా ''ఆ మూడో మనిషిఎవరా అని ఆలోచిస్తున్నాను'' అన్నాడట. ఆ మూడోమనిషి సుబ్రహ్మణ్యం చంద్రశేఖర్, సర్.సి.వి. రామన్ మేనల్లుడు. 1928లో ఎడ్డింగ్టన్ శిష్యరికానికై కేంబ్రిడ్జిలో కాలుపెట్టాడు.

అలా ముగ్గురికే పరిమంతమైన సిద్ధాంతం మరో 60 ఏళ్లకు చాలా మందికి తెలిసింది. ఇవాళ $E = mc^2$ అంటే ఏమిటో దైనందిన జీవితంలో అనుభవానికి రాకున్నా కోట్లాదిమంది కాలేజీ విద్యార్థులకూ, మరెందరో విద్యాధికులకూ సులభ గ్రాహ్యమైంది. కాంతికంటే వేగంగా ఏదీ వెళ్లలేదంటే ఒప్పుకుంటున్నాం. కాని దీనివల్ల విశ్వాంతరాళస్వరూప స్వభావాలు మరింత దురూహాహమయ్యాయి. తరవాతి కాలంలో రేడియేషన్, మైక్రోవేవ్ రేడియేషన్, ప్రాధాన్యత పొందాయి. అరిస్టాటిల్ సిద్ధాంత పునాదుల్ని కదిలించిన గెలీలియో న్యూటన్ల సిద్ధాంతాల్ని సాధారణ సాపేక్ష సిద్ధాంతం కదిలించింది. కాంతి ఋజుమార్గంలో పోతున్నట్టు స్థూల దృష్టికి కనిపించినా, ఆకర్షణ వికర్షణలకు లోనై వంపులు తిరుగుతుందని కూడా తెలిసింది. వంపులు తిరిగితే ఎక్కడో చోట వెనక్కు తిరగాలికదా? అంటే విశ్వాంతరాళానికి అంచులున్నాయా? ఇది దుప్పటిలా పరుచుకునుందా, లేక బెలూన్లా విచ్చుకుని ముడుచుకుందా? ఈ దుప్పటికి మడతలూ, ముడతలూ ఉన్నాయా? ఇది బెలూన్లా విచ్చుకుంటే మళ్లీ ఎప్పుడైనా ముడుచుకుంటుందా? లేక పేలిపోతుందా? ఈ బెలూనుకు (దుప్పటికి) బైట ఏముంది? ఇవన్నీ తిక్క ప్రశ్నల్లా కనిపించినా చిక్కు ప్రశ్నలేమరి.

జనన మందిన ప్రాణులు బావనేల
చచ్చు వారుండ మరల ఈ జనన మేల
త్రాసుగతి సృష్టి బేధం బుదాల్చనేల
శౌరికీ విశ్వసం సారభారమేల?

ఇన్ని ప్రశ్నలూ భక్త తుకారాం వేశాడు. ఇవి వైజ్ఞానికమైన ప్రశ్నలే మరి. నక్షత్రాలకూ, గ్రహాలకూ, నెబ్యులాలకూ, గెలాక్సీలకూ, ఈ ప్రశ్నలు వర్తిస్తాయి. దేవుడున్నాడా? దేవుడే వీటన్నిటిని సృజిస్తే ఈ బాధ్యత ఈయనమీద ఎవరు ఎలా ఎప్పుడు పెట్టారు? ఈ బాధ్యత నుంచి ఆయన తప్పుకోలేడా? తప్పు కోలేకుంటే ఆయన్ను కట్టి పడేసే గతి సూత్రం ఏమిటి? దాన్నెవరు సృజించారు? తప్పించుకో లేకుంటే ఆయన దేవుడెలా అవుతాడు? దేవుడు స్వాధీనుడా? పరాధీనుడా? ఈ బాధ్యత నుంచి ఆయన తప్పుకుంటే విశ్వాంతరాళం ఏమవుతుంది? దేవుడు ఏమవుతాడు? ఆయన నిర్మించిన సూత్రాలే ఆయనను బందీగా చేస్తున్నాయా? వీటిని మార్చే శక్తి, హక్కు ఆయనకున్నాయా? మార్చగలిగితే ఎప్పుడు ఎలా మార్చగలడు? అలా మార్చగలిగేందుకు ఆయనకు ముందూ వెనకా ఉన్న నమూనాలేమిటి?

ఇలాంటి ప్రశ్నలు వేసినందుకూ, జవాబులు తయారు చేసినందుకూ కోపర్నికస్ బిక్కు బిక్కుమంటూ బతికాడు. గెలీలియో పవిత్రమైన రోమన్ కాథలిక్ అనుయాయిగా ఉండి, పోప్‌కు స్నేహితుడై ఆయన నిర్దేశించిన మార్గ దర్శక సూత్రాల ప్రకారం క్రీ॥ శ॥ 1616 మే నెలలో రాసి ప్రచురించిన ఖగోళ శాస్త్ర గ్రంథాన్ని నిరసించిన విశ్వవిద్యాలయాల ఛాందస అధ్యాపకులు, ఆయన చావును ప్రేరేపించగలిగారు. సాధికారికమైన పదవుల్లో ఉండి ప్రొటస్టెంటుగా ఉన్న న్యూటన్ తాను కనుగొన్న మహోన్నత సూత్రాలను ముందుకు తీసుకుపోవాలనుకున్న సయకాలీన మేధావుల్ని అసహ్యించుకున్నాడు. విజ్ఞానం, మానవీయతా మేళవించిన వ్యక్తిత్వం కల ఐన్‌స్టీన్ కూడా చారిత్రక కారణాల వల్ల యూదుల రాజ్యా స్థాపనకూ ఇజ్రేయిలు దేశం ఆవిర్భావనకూ వత్తాసు పలికాడు.

ప్రధానంగానూ, సమంగానూ రాజకీయ పోరాటాలు నెరపిన ఐన్‌స్టీన్ "My life is divided equally between politics and equations" అని చెప్పినా, అంతిమంగా equations నే ఎంచుకుని, 1952లో ఇజ్రేలు అధ్యక్ష పదవిని త్రోసిపుచ్చాడు. వీళ్లందరూ నిజమైన అర్థంలో 'ప్రపంచ జ్ఞానం' కల మేధావులు.

అయితే బుద్ధిని (ఈ వ్యాసం మొదట్లో చెప్పినట్టు) నిరంతరం రబ్బరులా సాగాదీస్తూ సత్యాన్వేషణ సాగించడం ఐన్‌స్టీన్ తరవాతకూడా కొనసాగుతూనే ఉంది. అలాంటి కొన సాగింపుకు ఈనాడు మనమధ్య ఉన్న స్టీఫెన్ హాకింగును ఏకైక ప్రతినిధి గానూ, ప్రవక్తగానూ చెప్పుకోవాలి.

గెలీలియో చనిపోయిన మూడు వందల సంవత్సరాల తరవాత అదేరోజున 1942లో స్టీఫెన్ హాకింగ్ జన్మించాడు. గణితంలో రామానుజన్ అనంతత్వాన్ని (infinity) తెలుసుకున్నట్టుగానే హాకింగ్ విశాల విశ్వాంతరాళపు ఆద్యంతాలను తనదైన శైలిలో శోధించి కనుగొన్నాడు.

ప్రస్తుతం ఈయన, అలనాడు న్యూటన్, ఇరవైయ్యవ శతాబ్దిలో P.A.M. డురాక్ (అణుశాస్త్ర వేత్త) (can who rescarched on the big and the small) అలంకరించిన lucascian Professorship of Mathematics ను అతి చిన్న వయసులోనే పొందాడు. 1965 నాటికే ఈయనకు ALS వ్యాధి సంక్రమించిందని పరీక్షలలో తెలిసింది. దీన్ని లౌగ్రెహెగ్ (Lov Gehreg) వ్యాధి అంటారు. నరాలకు సంబంధించిన వ్యాధి (Nuerou Motor Disease) కండరాలు కదలవు. దీని ప్రభావంతో మొత్తం శరీరం చచ్చుబడిపోయింది. ఒక చేతిలో రెండు వేళ్ళ మొనలను మాత్రం కదిల్చే సామర్థ్యం మాత్రమే ఆయనకుంది.

ఈయన 1974 నాటికే తన చక్రాలకుర్చీలో కూర్చుని అతి కష్టం మీద అలనాడు న్యూటన్ వంటి మహనీయుల సంతకాలున్న పుస్తకంలో రాయల్ సొసైటీ మెంబరుగా సంతకం చేయగలిగాడు. తరువాత కాలంలో జరిగిన ఆపరేషన్‌లో ఈయన మాట్లాడే శక్తిని కోల్పోయాడు. ఆహారం మింగుడు పడడం కష్టం. మింగేటప్పుడు ఆహారం కుడి ఊపిరితిత్తిలోకి వెళ్లే ప్రమాదమూ ఉంది. అందువల్ల నర్సులు జాగ్రత్తగా తిండి తినిపిస్తారు. చిన్న పిల్లాడిలా మింగుడు పడక చాలా భాగం నోటిలోంచి ముందుకు పడిపోతుంది. ఇరవై నాలుగ్గంటలూ పదిమంది నర్సులు వంతుల వారిగా కనిపెట్టుకుని ఉంటారు.

మిగతా అధ్యాపకులు, ఆయన శిష్యులు కలసి ఆయన కోసం ప్రత్యేకంగా ఒక కంప్యూటర్‌ను రూపొందించారు. కంప్యూటర్ పాడ్‌ను తన మునివేళ్లతో కదిలించి అతిమెల్లగా సాగే ఆలోచనలకు అక్షర రూపం ఇస్తే అది కంఠస్వరంగా రూపొంది Voice Synthesiser కారణంగా మనకు వినబడు తుంది. ఆయనతో మాట్లాడేందుకు ఇదొక్కటే మార్గం. ఒక వాక్యం రాయాలన్నా మాట్లాడాలన్నా ఆయనకు ఇదే దారి. రాసుకోవాలన్నా, ఈక్వేషన్లు వేసుకోవాలన్నా ఆయనకు ఇంత శ్రమా తప్పదు.

1988లో ఆయనకు జరిగిన చికిత్సా సమయంలో ఆశ వదులుకున్న డాక్టర్లు ఆయనకు అమర్చిన ప్రాణ రక్షక సాధనాన్ని (Life Saving Device) ఆపుచేసేందుకు ఆయన భార్య అంగీకరించలేదు. ఆ తరవాత ఆయన బతికి నేటికీ బట్ట కట్టించుకుంటూనే ఉన్నాడు. దాదాపు ముప్పై రెండు

సంవత్సరాలుగా కొన ప్రాణంగా సాగుతున్న జీవితంలో ఆయన మేధస్సు విశ్వరహస్యాలను ఛేదించేందుకు చేసే ప్రయత్నాన్ని ఎంత మాత్రం ఆపలేదు. అధ్యాపకత్వం, అధ్యయనం, శిక్షణ, బోధన, పరిశోధన మానలేదు. ఆయన ప్రసంగాలను వినేందుకూ, ఏర్పాటు చేసేందుకూ ప్రపంచ వ్యాప్తంగా భారీ మొత్తాలను వెచ్చించేందుకు వెనుకాడని వారు ఎందరో ఉన్నారు. ఇన్ని వింతలను తనలో ప్రోదిచేసుకున్న విలక్షణ మేధావి విశ్వాంతరాళపు వింతలనూ, రహస్యాలనూ ఎన్నో కనుగొని అరటిపండు వలిచినట్లు చెప్పగల మహో మహోపాధ్యాయుడు కాగలగడం మరీ విశేషం. మన అదృష్టం

ఇలాంటి మేధా సంపత్తి గల వ్యక్తిని కాలస్వభావాన్ని గురించి, మూడు కొలతల ప్రపంచాన్ని గురించి, నాలుగు కొలతల విశ్వాంతరాళాల గురించి ప్రచురణ కర్తలు ఒక పుస్తకాన్ని రాయమన్నారు. ఐతే ఒక్క షరతు, ఒక్క సమీకరణం (equation) ఉంటే అమ్మకాలు సగానికి పడిపోతాయని అలాంటివి ఉండకూడదని ఎవరో అన్నారట. అందుకని సమీకరణాల గందరగోళాలు లేకుండా, అణువు, బ్రహ్మాండం, కాంతి, ఖగోళాలు, క్వాజర్లు, క్వార్క్స్, ఆంటీక్వార్క్స్, పోజిట్రాన్లు, న్యూట్రాన్లు, సూపర్ నోవా, డ్వార్ఫ్ నక్షత్రాలు, గురుత్వాకర్షణ, క్వాంటం మెకానిక్సు, అనిశ్చితత (uncertaintly principle) చీకటి కుహరాలు (Black Wholes) మన గురించి, మన మనస్సు గురించి, దేవుడు, విశ్వరచనలో దేవునిపాత్ర వాటి పరిమితులు, ఒకటేమిటి సమస్త విశ్వ విజ్ఞానపు టజ్ఞానాల అంచుల గురించి ఈ పుస్తకాన్ని రాయడం ఆలోచనా ఛందస్సుకు ఏర్చి కూర్చిన అమూల్యాలంకారం. పుస్తకమంతటిలోనూ ఒకే ఒక్క సమీకరణం ( అది ముందే చెప్పుకున్నట్లు ప్రపంచ ప్రాచుర్యం పొంది విద్యాధికులందరికీ అనుభవంలోకి రాకున్నా ఊహాకందే) $E = mc^2$ కనపడుతుంది.

అంతటి మేధావి ఇంత సులభగ్రాహ్యంగా చెప్పాలనుకోవడం మొదటి వింత. చెప్పగలడగం రెండో వింత ( మన దేశవాళీ విశ్వవిద్యాలయ మేధావులు ఒకరిద్దరు మినహా ఇలాంటి పనులకు పూనుకోలేదు).

ఈ పుస్తకం పేరు A Brief History of time రెండు వందల పేజీలు మాత్రమే ఉన్న ఈ పుస్తకంలో విశ్వావిర్భావ సిద్ధాంత రాద్ధాంతాలన్ని కూలంకషంగా ద్రాక్షా పాకన్యాయంగా చర్చించ బడ్డాయి. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది, కోట్లాది కాపీలు అమ్ముడయ్యాయి.

జిజ్ఞాసువులైన 'మిసిమి' పాఠకులు చదవాల్సిన గొప్ప పుస్తకంగా దీన్ని చెప్పుకోవాలి. ఇందులోని కొన్ని విషయాలు నండూరివారి 'విశ్వరూపం'లో కనిపిస్తాయి. కాని స్టీఫెన్ హాకింగ్ గొప్పతనాన్ని, భావనాపటిమనూ, ఆలోచనా నైశిత్యాన్ని, సునిశిత హాస్యాన్ని, ఆస్వాదించడానికే కాక, ప్రస్తుతం ఈ రంగంలో గల మొత్తం విజ్ఞానపు వైనాన్ని మనం తెలుసుకోవచ్చు. దీన్ని చదివిన వారెవరైనా బహుశః నేటికీ శాస్త్రజ్ఞులకు కొరకుడుపడని, కనుక్కోలేని Great unified theory ని కనుక్కొని విశ్వరచనకు వ్యాఖ్యానం రూపొందించగలరేమో కూడా! ఈ పుస్తకం తెలుగులో వస్తే బాగుంటుంది.

ఈ పుస్తకం ఒక విజ్ఞానఖని. దీన్ని చదవడం ఒక రసానుభూతి!


**References :** 1. A Breief History of time From Big Bang to Black Holes Stephen Hanking Bantam Books. 1996 Refrint First Published 1988.

2. Interview with Stephen Hanking The Hindu dt. 15.1.2000 Sunday Supplument.




ఈ సంచికలో ప్రచురితమైన ''దివ్యశక్తులుంటే'' అనే వ్యాసంలో
పరిచయం చేస్తున్న జేమ్స్ రాండి

MISIMI/మిసిమి RNI Regd. No. 45042/90 Telugu Monthly, Hyderabad-500 020. Postal Regd. No. H/SD/191.



మహా ప్రవేశమార్గం

రాజ ప్రాసాద శీవి ఒలుకుతున్న సోమర్సెట్ హౌస్ హాలు ప్రామాణిక శిల్పరాజాలతో అలంకరింపబడింది. బృహత్ప్రమాణంలో ఉన్న అపోలో బెల్వెడెర్, ఫరెన్సీ హెర్క్యులీజ్‌లను ప్రసాద ప్రవేశమార్గంలో అందరికీ బాగా కనిపించే చోట ఉంచారు.